ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
శనివారం 26 జూలై 2025



కేఎంఎఫ్ అధ్యక్షుడు హిట్నాళ్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

హిట్నాళ్‌కే కేఎంఎఫ్
అధ్యక్ష పీఠం

- ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ
- ఉత్కంఠ రేపినా .. ఏకగ్రీవం
- పంతం నెగ్గించుకున్న నాగేంద్ర, నారా

8



నిర్ణయం మీదే..!

- 'గ్రేటర్' ఏర్పాటుకు ప్రైవేట్ సంస్థల నుంచి సలహాలు
- వివిధ దశల్లో 52 వారాల గడువుతో నివేదిక
- అభివృద్ధే లక్ష్యంగా బీబీఎంపీ అడుగులు
- పాలన సులభతరం కోసమే ఐదు పాలికెలు

బెంగళూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): శరవేగంగా అభివృద్ధి చెందుతున్న రాజధాని బెంగళూరు నగరాన్ని మరింత గుర్తింపు తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైన విషయం తెలిసిందే. బెంగళూరు పరిధిని పెంచి సమగ్రత సాధించేందుకు కసరత్తు చేస్తున్నారు. బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ)లో 198 వార్డులు ఉండగా వార్డుల పునర్విభజన అనంతరం 243కు ఖరారు చేశారు. కొన్ని వార్డుల విస్తీర్ణం, జనాభా, ప్రాంతాలు, శాసనసభ నియోజకవర్గాల పరిధిలో మార్పు వచ్చింది. ఓటుబ్యాంకు ప్రాంతాలు మారిపోతున్నాయని అధికార, ప్రతిపక్షాల నాయకుల అభ్యంతరంతో కొన్ని మార్పులతో 2023లో 225కు ఖరారు చేశారు. ఐదేళ్లుగా బీబీఎంపీకి కార్పొరేటర్ల ఎన్నిక జరగలేదు. ఇందుకు వార్డుల విభజన, రిజర్వేషన్ల అంశం, జనాభా ప్రాతిపదకన అంటూ పలు అభ్యంతరాలతో వాయిదా పడుతూ వచ్చాయి. మరోవైపు పాలనాపరంగా విభజనకు వీలుగా బీబీఎంపీని గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ)గా మార్పు చేసేందుకు ప్రైవేట్ సంస్థ నుంచి సలహా, క్రియాశీలకమైన మద్దతు ఉండేలా పొందాలని నిర్ణయించారు. 'గ్రేటర్ బెంగళూరు పాలనా చట్టం 2024' ను మే 15న అమలులోకి తెచ్చారు. బీబీఎంపీ ప్రదేశాన్ని 'గ్రేటర్ బెంగళూరు ప్రదేశ్'గా ప్రకటించారు. అయినా బీబీఎంపీ చట్టం 2020 ప్రకారం బీబీఎంపీ పనిచేస్తోంది. పూర్తిస్థాయిలో గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ) ఏర్పాటయ్యేంతవరకు బీబీఎంపీ కొనసాగనుంది. జీబీఏను ఏర్పాటు చేసి దాని ద్వారా పాలన చేపట్టేలా ప్రక్రియ ప్రారంభమైంది.

- జీబీఏ పాలకవర్గం ఎలా ఉండాలి అనే అంశంపై ప్రముఖ సంస్థలనుంచి 'క్రియాశీలకమైన సలహా'లను పొందడానికి నిర్ణయించారు. ఇందుకు, బీబీఎంపీ చీఫ్ కమిషనర్ మౌలిక సదుపాయాల విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెండర్లు ఆహ్వానించారు. వేగంగా విస్తరిస్తున్న బెంగళూరు నగరంలో మౌలిక సదుపాయాలు, సేవలకు డిమాండ్ పెరిగింది. వీటిని నిభాయించడానికి 'గ్రేటర్ బెంగళూరు ప్రాధికార' స్థాపించడమే కీలకమని నిర్ణయించారు. తద్వారా నగర విస్తీర్ణం లక్ష్యంగా సేవలు అందించడానికి వీలు కానుందన్నారు. బీబీఎంపీని జీబీఏగా పరివర్తన చేయదలిచారు. పరిమితి, స్థానిక నగర పాలికెలు, ఇతరశాఖల మధ్య సమన్వయం, చేపట్టాల్సిన కార్యాచరణ విధానాలను కూడా ప్రైవేట్ సంస్థలను కూడా కోరారు.
- 'బీబీఎంపీని జీబీఏగా పరివర్తన చేయడం, బీ-స్మైల్ కార్యాచరణకు మద్దతు' శీర్షిక పేరిట క్రియాశీలక నివేదికలను ప్రైవేట్ సంస్థలనుంచి ఆహ్వానిస్తున్నారు. జీబీఏ పాలనా యంత్రాంగానికి ఎలాంటి పరిమితులు, ఆర్థిక నిర్వహణ విధానం, సంస్థల్లో బాధ్యతపై స్పష్టత, వనరుల విభజన, కొత్త నగర పాలికెలు, బీడీఏ, బెంగళూరు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, బెంగళూరు స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌ల మధ్య సమన్వయం పెంచేందుకు విధానాలను అభివృద్ధి చేయాల్సి ఉంది. అంతర సంస్థల సమన్వయంతోపాటు సమాన ఆదాయం, ఖర్చుల పంపిణీ, నిధుల వినియోగం, పాలనాపరమైన హద్దులను నిర్ణయించే కార్యచరణను రూపొందించాల్సి ఉంది.
- బీబీఎంపీని జీబీఏగా పాలనాపరంగా పరివర్తన చేసే ప్రక్రియ సజావుగా ఉండేలా సమగ్ర కార్యాచరణ గురించి అడిగారు. నగర పాలికెల మధ్య ఆస్తుల పంపిణీకి వంద రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సి ఉంది. పాలనా యంత్రాంగం ఏర్పాటులో ఎలాంటి అడ్డంకులు లేకుండా నిర్ణయాలు తీసుకునేలా యాక్షన్ ప్లాన్ ఉండాలి.
- 'గ్రేటర్ బెంగళూరు' దృఢమైన, బాధ్యతాయుత, ఉజ్వల భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే పాలనాపరమైన వ్యవస్థ ఉండేలా యాక్షన్‌ప్లాన్ రూపొందించాలని ప్రైవేట్ సంస్థల నుంచి సలహాలు తీసుకోదలిచారు. సరైన క్రియాశీలకమైన సలహా సూచనలు ఇచ్చే ప్రైవేట్ సంస్థతో బీబీఎంపీ ఒప్పందం చేసుకోనుంది. బి-స్మైల్ తొలి మండలి సభలో డైరెక్టర్‌ల అనుమతితో ఒప్పందాన్ని బి-స్మైల్‌కు బదిలీ చేయనున్నారని తెలుస్తోంది.

52 వారాల గడువు

ప్రైవేట్ సంస్థలనుంచి పొందే సలహా సూచనల నివేదికలకు కూడా గడువు విధించారు. మొత్తం 52 వారాల గడువు నిర్ణయించారు. వివిధ దశలలో ప్రారంభపు నివేదికకు 4వారాలుగా, జీబీఏగా పరివర్తన చేయడానికి ముసాయిదా నివేదికకు 10 వారాలు, బి-స్మైల్ యాక్షన్‌ప్లాన్ ముసాయిదా నివేదికకు 16 వారాలు, జీబీఏ, బి-స్మైల్‌కు తొలి యాక్షన్‌ప్లాన్ నివేదిక సమర్పించడానికి 22వారాలు గడువుగా నిర్ణయించారు.

గ్రేటర్ బెంగళూరులో ఐదు పాలికెలు

బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) కనుమరుగైంది. గ్రేటర్ బెంగళూరు అథారిటీ ఏర్పడింది. ఇందులో ఐదు నగరపాలికెలుగా విభజించారు. బెంగళూరు పశ్చిమ, బెంగళూరు దక్షిణ, బెంగళూరు ఉత్తర, బెంగళూరు తూర్పు, బెంగళూరు సెంట్రల్ పాలికెలుగా ప్రకటించారు. పాలికెల సరిహద్దులను గుర్తించారు. అయితే శాసనసభ నియోజకవర్గాలకు పాలికెలు అనుకూలంగా లేవని ఎమ్మెల్యేలు అభ్యంతరం తెలిపారు. ఒక్కో శాసనసభ నియోజకవర్గం పాలికెలలోకి విభజన అయ్యింది. ప్రభుత్వం నెలరోజులపాటు అభ్యంతరాలు, సలహాలు ఇచ్చేందుకు గడువు విధించింది. ఈలోగా ఎన్ని అభ్యంతరాలు వస్తాయో వేచి చూడాల్సి ఉంది.



22 కార్పొరేషన్లకు అధ్యక్షులు
ఖరారు

- ఎటూ తేలని ఎమ్మెల్సీ జాబితా
- పార్టీకి బానిసగా మారిన సీఎం
- ఢిల్లీ పర్యటనపై జేడీఎస్ ఎద్దేవా



బెంగళూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా పాలకవర్గాలులేని 22 బోర్డులు, కార్పొరేషన్లకు అధ్యక్షులను ఖరారు చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు గురువారం రాత్రి రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలాతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. 22 కార్పొరేషన్లకు అధ్యక్షుల పేర్లకు సుముఖత తెలిపారు. నాలుగు ఎమ్మెల్సీ స్థానాలకు పేర్లను పరిశీలన దశలోనే ఉంచారు. ముఖ్యమంత్రి మూడో విడత ఢిల్లీ పర్యటనలోనూ రాహుల్‌గాంధీని భేటీ కాలేకపోయారు. శుక్రవారం రాత్రికి సీఎం, డీసీఎంలు వెనుతిరిగి వచ్చారు. అయితే ఢిల్లీ పర్యటనలో సుర్జేవాలా ఏ సలహాలు ఇచ్చారనేది మాత్రం తెలియరాలేదు. కాగా నెలరోజుల వ్యవధిలో దాదాపు పదిరోజులకుపైగా బెంగళూరులో మకాం వేసిన రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలా అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారనేది తీవ్ర విమర్శలకు కారణమవుతోంది. ఎమ్మెల్యేలు, మంత్రులతో భేటీకి అభ్యంతరం ఉండదని, కానీ ప్రభుత్వ అధికారులతో సుర్జేవాలా ఎలా సమీక్షలు చేస్తారని జేడీఎస్ పార్టీ తీవ్రంగా మండిపడింది. ఇది రాజ్యాంగ వ్యతిరేకం కాదా..? అని ప్రశ్నించారు. ఇటీవల బెంగళూరుకు వచ్చిన సమయంలో కొందరు ఉన్నతాధికారులతో సుర్జేవాలా సమీక్ష జరిపినట్టు జేడీఎస్ ప్రకటించింది. జేడీఎస్ పార్టీ ఎక్స్ ద్వారా వసూలివాలానా..? లేక రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జా... లేదా సూడో ముఖ్యమంత్రినా అంటూ వ్యంగ్యం చేసింది. అధిష్టాన బానిసత్వంలో కూరుకుపోయిన సిద్దరామయ్య డమ్మీ సీఎం అయ్యారని ఎద్దేవా చేసింది. అయితే సహకారశాఖ మంత్రి రాజణ్ణ కూడా తీవ్రంగానే స్పందించారు. అధికారులతో సుర్జేవాలా సమావేశం జరిపితే అది రాజ్యాంగ విరుద్ధమేనని ఆరోపించారు. కొందరు అధికారులను సుర్జేవాలా ఢిల్లీకి పిలిపించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

సీఐడీకి బిట్లు శివ హత్య కేసు

- పరారీలో ఎమ్మెల్యే బైరతి బసవరాజు ఆప్తుడు

బెంగళూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ బిట్లు హత్యకేసును ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. దీంతో సీఐడీ పోలీసులు రంగంలోకి దిగారు. హత్యకేసులో ఏ5 నిందితుడిగా ఉన్న కేఆర్‌పుర ఎమ్మెల్యే బైరతి బసవరాజ్ ఇప్పటికే ఓసారి విచారణకు హాజరయ్యారు. హత్యకేసు వివాదం ఎమ్మెల్యే మెడకు చుట్టుకునేలా ఉంది. ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు అజిత్‌కు పోలీసులు గురువారం నోటీసులు జారీ చేశారు. విచారణకు వెళ్తే అరెస్టు చేస్తారనే భయంతో అజిత్ పరారీ అయ్యారు. పోలీసులు చర్యలు తీసుకునేలోపే అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. నిందితుడు కిరణ్ ఇంటిపై దాడి చేసిన వేళ పోలీసులకు కేరళ రాష్ట్రానికి చెందిన అజిత్‌కు సంబంధించి పలు రికార్డులు లభ్యమయ్యాయి. వీటి ఆధారంగా విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చారు. నోటీసు స్వీకరించిన అజిత్ చిరునామాలేని లెటర్‌హెడ్‌పై వివరణ ఇచ్చారు. తాను హైకోర్టు న్యాయవాదినని, హత్యతో తనకు సంబంధం లేదని, కేసులో ఇరికించాలని ప్రయత్నిస్తున్నారని, చట్టపరంగా ముందుకెళ్తానని పోలీసుల వద్ద అజిత్ హల్‌చల్ చేశారు. అయితే అరెస్ట్ భయంతో పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. టీసీపాళ్యలోని సినిమాస్ వీ గ్రూప్ కార్యాలయాన్ని ఖాళీ చేసి పరారయ్యారు. పోలీసులు సోదాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

లారీ, కారు ఢీ - నలుగురి మృతి



ప్రమాదంలో నుజ్జయిన కారు



మృతి చెందిన నలుగురు స్నేహితులు(ఫైల్)

బెంగళూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): లారీ, కారు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో నలుగురు మృత్యువాత పడ్డారు. శుక్రవారం మధ్యాహ్నం కొడగు జిల్లాలో ఈ సంఘటన చోటు చేసుకుంది. మంగళూరు నుంచి మడికేరి వైపు వెళ్తున్న లారీని, మడికేరి నుంచి వస్తున్న కారు ఢీ కొంది. ప్రమాదంలో కారులోని నలుగురు యువకులు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. మృతులను గోణికొప్పకు చెందిన రిజ్వాన్, నహీద్, రాకిబ్, నిహాద్‌గా గుర్తించారు. వీరంతా పాతికేళ్లలోపు వారేనని తెలుస్తోంది. వీరంతా దక్షిణకన్నడ జిల్లా ఉళ్ళాల ప్రాంతంలో సరదాగా పర్యటించి తిరిగి వస్తుండగా కోయ్నాడు సమీపాన ప్రమాదం చోటు చేసుకుంది. మడికేరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

జేడీఎస్ నాయకుడి హత్య వెనుక భార్య

- సుపారీ ఇచ్చి లోకేశ్‌ను చంపించిన చంద్రకళ
- వివాహేతర సంబంధం, ఆస్తి గొడవలే కారణం
- పోలీసు విచారణలో కుట్ర బట్ట బయలు

బెంగళూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): బెంగళూరు దక్షిణ జిల్లా చన్నపట్టణ తాలూకా మాకళి గ్రామ పంచాయతీ మాజీ సభ్యుడు, జేడీఎస్ నాయకుడు లోకేశ్ హత్య కేసు మలుపు తిరిగింది. భార్య చంద్రకళ సుపారీ ఇచ్చి ఆయనను హత్య చేయించినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను శుక్రవారం అరెస్ట్ చేశారు. లోకేశ్, చంద్రకళకు 18ఏళ్లక్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. లోకేశ్ వ్యవసాయం చేసుకుంటూ, జేడీఎస్‌లో క్రియాశీలకంగా ఉండేవారు. బెంగళూరులోని రెండు మూడు ప్రాంతాల్లో కోళ్ల దుకాణాలను నిర్వహించేవారు. చంద్రకళకు ఇటీవల పోస్టల్‌శాఖ ఉద్యోగి యోగేశ్‌తో ఏర్పడిన స్నేహం వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఇదే విషయమై లోకేశ్ ఇంట్లో గొడవపడేవారు. బెంగళూరులో ఉండే ఓ స్థలాన్ని విక్రయించేందుకు లోకేశ్ ప్రయత్నించడాన్ని భార్య చంద్రకళ వ్యతిరేకించారు. ఏడు నెలల క్రితం ఓసారి లోకేశ్‌ను హతమార్చేందుకు రూ.2 లక్షల సుపారీ ఇచ్చారు. కానీ ఆ డబ్బు తీసుకున్నవారు కనిపించకుండా పరారీ అయ్యారు. దీంతో రెండోసారి ప్రియుడు యోగేశ్‌తో కలసి రూ.3.5 లక్షల సుపారీ ఇచ్చారు. నేరాలతో సంబంధం ఉన్న సూర్య శివలింగ, చందన్, శాంతరాజ్.. జూన్ 23న బెంగళూరు నుంచి మాకళి గ్రామంవైపు వెడుతున్న లోకేశ్ కారును అడ్డగించి కిడ్నాప్ చేశారు. అతడి కారులోనే నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి బలవంతంగా క్రిమిసంహారక మందు తాగించారు. కారు పక్కనే లోకేశ్ మృతదేహాన్ని ఉంచి, క్రిమిసంహారక మందు బాటిల్‌ను కారులో ఉంచి పరారీ అయ్యారు. మరుసటి రోజు లోకేశ్ మృతదేహాన్ని గుర్తించారు. మొదట ఆత్మహత్య చేసుకుని ఉంటారని ఎంకే దొడ్డి పోలీసులు భావించారు. కానీ, పలు కోణాల్లో దర్యాప్తు చేశారు. హత్యకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించకుండా జాగ్రత్త పడాలని చంద్రకళ అందరికీ సలహాలు ఇచ్చింది. లోకేశ్ మరణానంతరం చన్నపట్టణలో పత్రికా సమావేశం ఏర్పాటు చేసి, తన భర్తను హత్య చేసినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎందుకు హత్య చేశారో తేల్చాలని, తన భర్త ఆత్మకు శాంతి లభించాలని, దోషులకు కఠినశిక్ష పడాలని అన్నారు. హత్య పథకం అమలు కోసం చంద్రకళ కొత్త మొబైల్, ఓ సిమ్‌కార్డును సమకూర్చుకున్నారు. నిందితులు హత్య చేసేందుకు ఓ కారును కొనుగోలు చేశారు. లోకేశ్ మృతదేహాన్ని పరిశీలించినప్పుడు పోలీసులకు కొన్ని అనుమానాలు కలిగాయి. క్రిమిసంహారక మందు బాటిల్ కనిపించకపోవడం, ఓ చెప్పు లేకపోవడం, చంద్రకళ సాధారణ ఫోన్ కాకుండా మరో నంబరును వాడటంతో దర్యాప్తు ముమ్మరం చేశారు. తొలుత చంద్రకళ, యోగేశ్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు తమదైనశైలిలో విచారించారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.



చంద్రకళ, లోకేశ్ దంపతులు (ఫైల్)

దక్షిణ కైలాసం..!

- 64 జ్యోతిర్లింగాలు.. 32 రూపాల్లో వినాయకుడు
- మహిమాన్వితం బెంకల్ దేవస్థానం



ఆలయంలో భక్తుల సందడి



111.2 అడుగుల ఎత్తైన శివ లింగం

బెంగళూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఎన్నో శైవక్షేత్రాలు ఉన్నాయి. ఉత్తరాదిన కాశీ, దక్షిణాదిన రామేశ్వరం పవిత్రస్థలాలుగా రాణిస్తున్నాయి. దక్షిణభారత్‌లో ప్రాచీన, వివిధ ప్రత్యేకతలు కల్గిన శైవక్షేత్రాలు వెలసి ఉన్నాయి. అదే తరహాలోనే కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంనకు 24 కిలోమీటర్ల దూరంలో బెంకల్‌లో వెలసిన మహేశ్వరం శివపార్వతి దేవస్థానం పలు ప్రత్యేకతలతోపాటు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రికార్డులు కలిగి ఉన్నాయి. దేశంలోనే అత్యంత ఎత్తు కల్గిన శివలింగం ఇక్కడి ప్రత్యేకం. అందుకే ఈ ప్రాంతాన్ని దక్షిణకైలాసంగా పిలుస్తారు. 111.2 అడుగుల ఎత్తుతో 50 వెడగుల వెడల్పుతో అత్యంత సుందరమైన శివలింగాన్ని ఇక్కడ దర్శించవచ్చు. దేశంలో అతిపెద్ద శివలింగ ఆలయం 2012లో నిర్మాణాలు ప్రారంభమై ఆరేళ్ల తర్వాత పూర్తయ్యింది. కర్ణాటకలోని కోటిలింగేశ్వర ఆలయంలో 108 అడుగుల శివలింగం ఉండగా బెంకల్ ఆలయంలో 111 అడుగులు ఉండడం ప్రత్యేకత. శివలింగం ఎత్తు 10 అంతస్తుల నిర్మాణానికి సమానంగా ఉంది. సిలిండర్ ఆకారంలో 8 అంతస్తులు కలిగి ఉంది. వాటిలో ఆరు అంతస్తులు మానవదేహం చక్రాలు లేదా శక్తికేంద్రాలుగా ప్రతిబింబిస్తున్నాయి. శివపార్వతులు హిమాలయాలలో నివసించే వేళ హిమం రూపంలో విగ్రహాలు రూపుదిద్దుకున్నాయి. ఇదే ప్రాంతంలో 108 శివలింగాలు దర్శనం చేసుకోవచ్చు. అభిషేకాలు చేసుకోవచ్చు. హిమాలయంలో 7 కొండల తరహాలో మార్గాన్ని అమర్చారు. ఇక్కడ భక్తులు ఒకేస్థలంలో 64 శివజ్యోతిర్లింగాలను, 32 రూపాల వినాయకుడిని పూజించబడే ఏకైక దేవాలయంగా పేరుంది. మహేశ్వరం శివపార్వతి ఆలయంలో శివలింగంతోపాటు శాంతి, ధ్యానం చేసుకునేందుకు అనుకూలంగా ఉంది. గుహ తరహాలో లింగం లోపలిభాగంలో భక్తులు మానవదేహ శక్తికేంద్రాలలో ధ్యానం చేసేందుకు ప్రత్యేకంగా ఆరు ధ్యానమందిరాలను ఏర్పాటు చేశారు. పైభాగంలో సహస్రార చక్రాన్ని రూపొందించారు. బెంకల్ మహేశ్వర శివపార్వతి ఆలయం ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదుకు ప్రక్రియలు సాగుతున్నాయి. జాతీయ యాత్రా కేంద్రంగా విరాజిల్లుతోంది. ఆషాఢ అమావాస్యన ప్రత్యేక పూజలు కొనసాగడంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తిరువనంతపురం నుంచి 45 నిమిషాలు ప్రయాణిస్తే మహేశ్వరం శివపార్వతి ఆలయం దర్శించుకోవచ్చు. కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివెళ్తుంటారు.

33 మార్కులకే పాస్

- ఎస్ఎస్ఎల్‌సీ, పీయూ కోర్సుల్లో అమలుకు ప్రభుత్వం నిర్ణయం
- నోటిఫికేషన్ జారీ
- 15రోజుల వరకు అభ్యంతరాల స్వీకరణ



బెంగళూరు, జూలై25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించడానికి ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. ఎస్ఎస్ఎల్‌సీ, పీయూ కోర్సుల్లో ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే 33 మార్కులకే ఉత్తీర్ణత మార్కులుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇంటర్నల్ మార్కులతోపాటు పరీక్షలు రాయడం ద్వారా కలిపి ఒక్కో సబ్జెక్టులో వందకు 33 మార్కులు సాధిస్తే ఉత్తీర్ణత సాధించినట్లు అవుతుంది. ఇంటర్నల్ మార్క్స్ 20గా ఉన్నాయి. అందులో 20కు 20 సాధిస్తే, పరీక్షల్లో రాయడం ద్వారా 13 మార్కులు పొందితే ఉత్తీర్ణత సాధించినట్లు అవుతుంది. గురువారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. 15రోజుల్లోగా సందేహాలను, అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు వీలుంది. 15రోజుల తర్వాత గెజిట్ నిబంధనలు పరిగణనలోకి తీసుకుంటారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎస్ఎస్ఎల్‌సీ, పీయూ తరగతుల్లో ఉత్తీర్ణత సాధించేందుకు 35 మార్కులు సాధించాల్సి ఉంది. కొత్త నిబంధనల ప్రకారం 2 మార్కులు తగ్గించారు. దీనిపై పలువురు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.


పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి దేవాలయం

ఇదీ చరిత్ర..

14వ శతాబ్దంలో సంహపురి (నేటి నెల్లూరు)ని కాటమరాజు పరిపాలించే రోజుల్లో విపరీతమైన కరువు సంభవించింది. రాజు ఆజ్ఞ ప్రకారం పశువుల విడిది కోసం సేనాధిపతి రాజ్యమంతా తిరుగుతూ ఖాద్రీ పురం (కదిరి) గ్రామానికి చేరాడు. పట్టణంలోని శ్రీ ఖాద్రీ నరసింహస్వామిని దర్శించుకున్న సేనాధిపతి గుర్రాలను మేతకు విడిచి గ్రామమంతా తిరిగాడు. గ్రామం మొత్తం మల్లెపూల పరిమళం, ఎటుచూసినా పచ్చని పొలాలతో సస్యశ్యామలంగా ఉండడాన్ని చూసి, ఈ ప్రాంతాన్ని కరువు విడిదిగా ఎంచుకున్నాడు సేనాధిపతి. విషయం రాజుకు తెలియజేశాడు. రాజు ఆజ్ఞ ప్రకారం కదిరి పట్టణానికి ఏడు మైళ్ల దూరంలో ఉన్న నల్లచెరువు గ్రామ పరిధిలోని దిన్నె మీద పశువుల కోసం పాగా వేశారు. దిన్నెమీద ఉన్న గడ్డి మేయగానే పశువులు సమృద్ధిగా పాలిచ్చాయి. ఇలా కొన్నిరోజులు గడిచాక పశువులు పాకవేసిన ప్రాంతానికి కొంత దూరంలో పుట్ట ఉండేది. ఆ పుట్ట దగ్గరకు ఈనని గోవులు వెళ్లి నిలబడగా వాటి పొదుగు నుంచి పాలుగారి పుట్టలోకి వెళ్తున్న విషయాన్ని గమనించి సేనాధిపతి ఆశ్చర్యానికి లోనయ్యాడు. పుట్టకు పూజలు చేసి, తవ్వించి చూడగా శ్రీరాముడి పరమ భక్తుడైన ఆంజనేయుడి విగ్రహం బయటపడింది. సేనాధిపతి ద్వారా విషయం తెలుసుకున్న కాటమరాజు.. స్వామి విగ్రహాన్ని ఆ స్థలంలో ప్రతిష్ఠించారు. ఒక్క రోజులోనే స్వామి గుడి కట్టారు. పాలు పారిన దిన్నె కాబట్టి పాలపాటిదిన్నెగా ప్రసిద్ధి చెందింది.

పాహిమాం.. అంజనన్నా..

నేటి నుంచి శ్రావణ మాస ఉత్సవాలు

భక్తుల కొంగుబంగారం పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి

నల్లచెరువు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రమాణాల దేవుడిగా పేరొందిన శ్రీ పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయం ఉత్సవ శోభను సంతరించుకుంది. శనివారం శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. మండలంలో వెలసిన పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా ప్రసిద్ధి. కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాలతోపాటు కర్ణాటక నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. శ్రావణమాస ఉత్సవాలు ప్రత్యేకం. నెలలోని అన్ని శనివారాల్లో స్వామివారి ఉత్సవాలు నిర్వహిస్తారు. మంగళవారాల్లో కూడా ప్రత్యేక పూజలు చేస్తారు. దీంతో శ్రావణ మాసం అంతా ఆలయంలో సందడిగా ఉంటుంది. స్వామి సన్నిధిలో అబద్ధపు ప్రమాణం చేస్తే కీడు వాటిల్లుతుందని భక్తుల విశ్వాసం. దీంతో పక్క జిల్లాల నుంచి ఇక్కడికి ప్రమాణాలు చేసేందుకు వస్తుంటారు.

బావిలో చేదబావి

ఆలయ ప్రాంగణంలోని బావిలో చేదబావి ఉండడం ఎంతో ప్రత్యేకం. ఈ బావిలో స్నానం ఆచరించి తలనీలాలు సమర్పించి దేవుడిని దర్శించుకుంటే పుణ్యం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. ఎలాంటి కరువుకాటకాలు వచ్చినా ఈ చేద బావిలో నీరు ఇంకిపోదు. శ్రావణ మాసంలో ఐదు శనివారాల్లో ఉత్సవాలు, మంగళవారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.


బావిలో ఉన్న చేదబావి

భక్తులకు వసతులు కల్పించాం

ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను నడపనుంది. దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. పోలీసు శాఖ ద్వారా పటిష్ట బందోబస్తు కల్పిస్తాం.



- మురళీకృష్ణ, ఆలయ ఈఓ


ఆంజనేయ స్వామి మూలవిరాట్

ఆలయానికి చేరుకోవచ్చు ఇలా..

కదిరి నుంచి నల్లచెరువు పాతరైల్వేస్టేషన్ వద్ద దిగితే అక్కడినుంచి ఆటోలు వెళ్తాయి. నల్లచెరువు నుంచి పాలపాటి దిన్నెకు ఆటోలు నడుస్తుంటాయి. ఆర్టీసీ శ్రావణమాసం సందర్భంగా 20 ప్రత్యేక బస్సులు నడుపుతోంది. కదిరి నుంచి ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు నడుస్తుందని ఆర్టీసీ డీఎం తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు మరిన్ని పరిశ్రమలు

- సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బాలకృష్ణ శ్రద్ధ
- పురంలో నందమూరి వసుంధరా దేవి
- 'సుపరిపాలనలలో తొలి అడుగు'కు విశేష స్పందన


కరపత్రాన్ని ఇస్తున్న వసుంధరాదేవి

హిందూపురం, జూలై 25(ఆంధ్ర జ్యోతి): వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధి చెందాలంటే మరిన్ని పరిశ్రమలు రావాల్సి ఉందని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరా దేవి అన్నారు. పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు పుష్కలంగా దొరుకుతాయని అన్నారు. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బాలకృష్ణ ఈ అంశంపై ప్రత్యేకశ్రద్ధ పెట్టారని అన్నారు. హిందూపురం నియోజకవర్గంలో శుక్రవారం ఆమె విస్తృతంగా పర్యటించారు. తూమకుంట చెక్‌పోస్టు వద్ద ఆమెకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి గోళ్లాపురం పారిశ్రామికవాడకు వెళ్లి నూతనంగా నిర్మించిన 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. హిందూపురం మండలంలోని వీవర్స్‌కాలనీలో ఇంటింటికి వెళ్లి 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం లేపాక్షి-ఓబుళాపురం బీటీ రోడ్డును ప్రారంభించారు. చిలమత్తూరు మండలం తమ్మనాయనపల్లి రోడ్డుకు భూమిపూజ చేశారు. హెరిటేజ్ సంస్థ సీఎస్‌ఆర్ నిధులతో సమకూర్చిన సోలార్ వాటర్ హీటర్‌లను లేపాక్షి నవోదయ పాఠశాలలో ప్రారంభించారు. విద్యార్థినులను పలకరించి, యోగక్షేమాలను తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. హిందూపురం వీవర్స్‌కాలనీ, 8, 9 వార్డులలో జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, హిందూపురం నియోజకవర్గానికి మరిన్ని పరిశ్రమలు వస్తాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురం అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని అన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, తొలి అడుగు కార్యక్రమంలో మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు ముందుకొచ్చి ఈ విషయం చెబుతున్నారని అన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు కాలువలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడానికి హిందూపురానికి రూ.92 కోట్లు నిధులు వచ్చాయని తెలిపారు. పట్టణంలో పాత పైప్‌లైన్ స్థానంలో కొత్త పైప్‌లైన్ ఏర్పాటుకు రూ.136 కోట్లు మంజూరయ్యాయని, ఈ పనులు త్వరలో ప్రారంభమౌతాయని తెలిపారు. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని అన్నారు. శ్రావణమాసం మొదటి శుక్రవారం హిందూపురంలో జనం మధ్య గడపటం సంతోషంగా ఉందని అన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల కింద రూ.45కోట్ల పనులు జరిగాయని తెలిపారు. వచ్చే రెండు మూడు మాసాల్లో మరో రూ.40 కోట్లు వస్తాయని తెలిపారు. హిందూపురం చేనేత కార్మికులు నేసిన చీరలనే తాను ధరిస్తానని అన్నారు. పలుచోట్ల మహిళలు వసుంధరాదేవికి చీర, సారె, పసుపు కుంకుమ అందజేశారు. మహిళలను ఆమె ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏలు సురేంద్ర, వీరయ్య, మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థరెడ్డి, పార్టీ కన్వీనర్‌లు ప్రెస్ వెంకటేశ్, హెచ్‌ఎన్ రాము, అభిలాష్, శ్రీనివాస్, నాయకులు దేవరాజ్, మంగేష్, అనీల్, పరిమళ, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలతోనే ఆర్థిక ప్రగతి : ఇన్‌చార్జ్ కలెక్టర్



అనంతపురం కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపన విస్తృతంగా జరగాలని, వాటితో ఆర్థిక ప్రగతి సాధించవచ్చని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం 60వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఏపీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగం పటిష్టం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి వారికి సకాలంలో సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులను ఇవ్వాలన్నారు. గత నెలలో జరిగిన సమావేశం నుంచి ప్రస్తుతం సింగిల్ డెస్క్ విధానంలో 224 ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోగా 25 దరఖాస్తులను ఆమోదించారని, మిగిలిన దరఖాస్తులను సత్వరమే పరిశీలించి ఆమోదించాలని ఆదేశించారు. జిల్లాలో 2020-23, 2023-27 పాలసీలో 13 యూనిట్లకుగాను రూ.2,30,54,540లు సబ్సిడీ మంజూరుకు సమావేశంలో ఆమోదం తెలిపారు. జిల్లాలో ఎంఎస్‌ఎంఈ పార్కులో ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాలను గుర్తించాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌ను ఆదేశించారు. జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయబోతున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతకు టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్, స్కిల్ ట్రైనింగ్ ఇచ్చే విధంగా ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్‌యాదవ్, ఏడీ రాజశేఖర్‌రెడ్డి, వాణిజ్య శాఖ కృష్ణారెడ్డి, ఆర్టీఓ వీర్రాజు, ఏపీఐఐసీ మేనేజర్ మల్లికార్జున, డీఎస్‌డీఓ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతి శాఖ సమన్వయంతో పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారంలో ఎన్‌సీఓఆర్‌డీ(నార్కో కోఆర్డినేషన్ సెంటర్)జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ... మాదక ద్రవ్యాల వినియోగంతో జరిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గంజాయి సాగు లాంటివి ఎక్కడైనా జరిగినట్లు తెలిస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం అందించాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో టోల్‌ఫ్రీ ఏర్పాటు చేసి డ్రగ్స్ సరఫరా, వినియోగం లేకుండా గట్టి నిఘా పెంచి చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, సీఐలు హరినాథ్, హనుమంతు పాల్గొన్నారు.

గుప్తనిధుల వేట


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎక్స్‌కవేటర్, సుమో

జిల్లాలో రెండుచోట్ల తవ్వకాలు

నాగసముద్రం వద్ద తొమ్మిది మంది అరెస్టు

కుందుర్పి మండలంలో అదుపులోకి ముఠా?

గుంతకల్లు/కళ్యాణదుర్గం/కుందుర్పి, జూలై25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు వేర్వేరుచోట్ల గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపడుతున్న ముఠాల ఆట కట్టించారు పోలీసులు. ఓ చోట తొమ్మిది మందిని అరెస్టు చేయగా.. మరోచోట ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గుంతకల్లు మండలం నాగసముద్రం గ్రామం వద్ద గుప్తనిధుల కోసం తవ్వకాలు చేస్తున్న తొమ్మిది మందిని గుంతకల్లు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ముఠా అరెస్టు వివరాలను శుక్రవారం ఉదయం గుంతకల్లు రూరల్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసులు వెల్లడించారు. నాగసముద్రం గ్రామం వద్ద ఉన్న చౌడమ్మ దేవాలయ సమీపంలో కొందరు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేస్తున్నారన్న సమాచారం రావడంతో రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్ప ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం దాడి చేశారు. అనంతపురం జిల్లా, తెలంగాణ రాష్ట్రానికి చెందిన తొమ్మిది మంది తవ్వకపు సామగ్రితో పట్టుబడ్డారు. వజ్రకరూరు మండలం కొనకొండ్లకు చెందిన తిమ్మాపురం రాము, కమలపాడు వాసి బురుజుల బోయ శ్రీనివాసులు, గుంతకల్లు పట్టణం దోనిముక్కల రోడ్డులో నివసిస్తున్న మేకల దేవేంద్ర, పామిడి మండలం గజరాంపల్లికి చెందిన జే పరశురాముడు, తెలంగాణ రాష్ట్రానికి చెందిన పసుపుల మహేందర్, ఇరికల వెంకటేశులు, మాడ మహేందర్, భట్టగిరి అంజులయ్య, ముద్దనూరి సురేంద్రను అరెస్టు చేశారు. మరో ఇద్దరు సూరి, నారాయణస్వామి పరారయ్యారని డీఎస్పీ తెలిపారు. పట్టుబడిన వారి నుంచి ఆటో, ఇన్నోవా వాహనం, గుప్త నిధులను గుర్తించే మెటల్ డిటెక్టర్, తవ్వకం సామగ్రితోపాటు, తవ్వకాల్లో దొరికిన మట్టికుండ, 8 సీసపు గోళీలు, సీసపు కడ్డీలు, రెండు చిన్న ఉంగరాలు, రెండు చిన్న ప్రతిమలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పోలీసుల అదుపులో 9 మంది..

కుందుర్పి మండలంలోని రుద్రంపల్లి సమీపాన మల్లప్ప దేవాలయ పరిసర ప్రాంతంలో ఓ తోటలో గురువారం అర్ధరాత్రి గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపడుతున్న 9 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఎక్స్‌కవేటర్, సుమో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఓ వ్యక్తి గుప్తనిధులు తీసుకువచ్చి ఈ ప్రాంతంలో పాతిపెట్టి, చనిపోయాడని పలువురు ఆ దాచిపెట్టిన గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. అలా.. పోలీసులకు దొరికిపోయినట్లు తెలుస్తోంది. కుందుర్పి మండలం రుద్రంపల్లికి చెందిన ముగ్గురు, అనంతపురానికి చెందిన ముగ్గురు, కేరళ వాసులు ఇద్దరు, కంబదూరు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. రెండ్రోజుల్లో వివరాలు వెల్లడించే అవకాశాలు ఉన్నాయి.

ఫిర్యాదు ఉంటేనే..!

- బదిలీ అక్రమాలపై విచారణకు షరతు
- విస్తుగొలిపేలా విద్యాశాఖ నిర్ణయాలు

అనంతపురం విద్య, జూలై 25(ఆంధ్రజ్యోతి): బదిలీల సమయంలో అడ్డదారులు తొక్కిన ఉపాధ్యాయులకు విద్యాశాఖ కమిషనరేట్ 'పెద్ద ఊరట' కల్పించింది. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు, 'గడువులోగా వచ్చిన ఫిర్యాదులపై మాత్రమే విచారించండి' అని జిల్లా అధికారులను ఆదేశించింది. జిల్లాలో బదిలీలలో లబ్ధికోసం 422 మంది ఉపాధ్యాయులు మెడికల్ సర్టిఫికెట్లను సమర్పించారు. వీటిలో భారీగా నకిలీవి ఉన్నాయని అప్పట్లో కొందరు ఉపాధ్యాయులు గగ్గోలు పెట్టారు. వీటిలో 12 సర్టిఫికెట్లపై మాత్రమే అప్పట్లో ఫిర్యాదులు అందాయి. దీంతో వాటిని మాత్రమే విద్యాశాఖ అధికారులు పరిగణనలోకి తీసుకుని, విచారించేందుకు సిద్ధమవుతున్నారు.

భారీగా అక్రమాలు

బదిలీల సమయంలో తమకు అనుకూలమైన ప్రాంతాలకు వెళ్లేందుకు పలువురు ఉపాధ్యాయులు అడ్డదారులు తొక్కారు. నకిలీ మెడికల్ సర్టిఫికెట్లు సమర్పించారు. నిబంధనల మేరకు స్పౌజ్ పాయింట్లు పెట్టి ఉంటే భర్త, లేదా భార్య ఎక్కడ పనిచేస్తుంటే అక్కడకు బదిలీ చేయాల్సి ఉంటుంది. కానీ వెబ్ కౌన్సెలింగ్‌లో ఇష్టానుసారంగా స్థానాలకు ఆప్షన్లు ఇచ్చారు. లేని రోగాలు ఉన్నట్లు చూపించి, నకిలీ మెడికల్ సర్టిఫికెట్లు సమర్పించారు. తద్వారా ప్రిఫరెన్షియల్ కేటగిరీలో కోరుకున్న స్థానాలను దక్కించుకున్నారు. ఈ అక్రమాలపై బాధిత ఉపాధ్యాయులు అప్పట్లో గళం విప్పారు. అధికారులు విచారించి, న్యాయం చేయాలని వేడుకున్నారు.

షరతులు వర్తించాయి..

అక్రమాలపై విచారిస్తామని చెబుతూనే.. అక్రమార్కులకు కొందరు అధికారులు అప్పట్లో కొమ్ముకాశారు. బదిలీలలో చేయాల్సిందంతా చేశారు. ఇప్పుడు ప్లేటు ఫిరాయించి, అభ్యంతరాలకు గడువు ఇచ్చామని, ఆ లోగా వచ్చిన ఫిర్యాదులను మాత్రమే విచారిస్తామని అంటున్నారు. జిల్లాలో 12 మంది ఉపాధ్యాయుల మెడికల్ సర్టిఫికెట్లపై మాత్రమే ఫిర్యాదులు వచ్చాయని, వాటిని మాత్రమే విచారిస్తామని డీఈఓ ప్రసాద్‌బాబు అంటున్నారు. స్పౌజ్, అక్రమ పాయింట్లు వంటి ఇతర ఫిర్యాదుల విషయంలోనూ 'గడువులోగా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసి ఉంటేనే' అని డీఈఓ కార్యాలయ అధికారులు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఇది కమిషనరేట్ నిర్ణయం అని చెప్పి తప్పుకుంటున్నారు. దీంతో అక్రమార్కులు 'హమ్మయ్యా..' అని ఊపిరి పీల్చుకుంటున్నారు. నష్టపోయిన ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంచి ర్యాంక్ ఉన్నా అన్యాయం చేశారు

హైకోర్టులో పిటిషనర్ల తరపు న్యాయవాది

అగ్రికల్చర్ అసిస్టెంట్ల కేసు విచారణ 28కి వాయిదా

అనంతపురం అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మంచి ర్యాంకు ఉన్న అగ్రికల్చర్ అసిస్టెంట్లకు బదిలీల్లో అన్యాయం చేయడంతోపాటు స్టేటస్ కో ఆర్డర్‌ను అమలు చేయలేదని పిటీషనర్ల తరపు న్యాయవాది హైకోర్టులో వాదనలు వినిపించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో తమకు అన్యాయం జరిగిందని శ్రీసత్యసాయి జిల్లాలోని 11 మంది, అనంత జిల్లాలో ఇద్దరు, కర్నూలులో 20 మంది, ప్రకాశం, చిత్తూరు జిల్లాకు చెందిన మరికొందరు అగ్రికల్చర్ అసిస్టెంట్లు హైకోర్టును వేర్వేరుగా ఆశ్రయించారు. ఆయా జిల్లాల సిబ్బంది రిట్ పిటిషన్లపై హైకోర్టు వేర్వేరుగా స్టేటస్‌కో ఆర్డర్లు జారీ చేసింది. అయితే ఆయా జిల్లాల సిబ్బంది అందరిది ఒకే సమస్య కావడంతో అన్ని పిటిషన్లను కలిపి ఈనెల 23న విచారణకు పిలిచింది. అయితే అగ్రికల్చర్ అసిస్టెంట్ల పిటిషన్‌పై వ్యవసాయ శాఖ కౌంటర్ (అఫిడవిట్) దాఖలు చేయకపోవడంతో శుక్రవారానికి విచారణ వాయిదా వేసిన విషయం తెలిసిందే. శుక్రవారం రెండో సారి విచారణలో ఉమ్మడి అనంతకు జిల్లా పిటిషనర్ల తరపు న్యాయవాది అగ్రికల్చర్ అసిస్టెంట్ల బదిలీల్లో జరిగిన అన్యాయాన్ని జడ్జి దృష్టికి తీసుకువెళ్లారు. మరింత సమాచారం సేకరణ కోసం విచారణను ఈనెల 28కి జడ్జి వాయిదా వేశారు.

స్టేటస్‌కోను పట్టించుకోని అధికారులు

ఉమ్మడి జిల్లాకు సంబంధించి రైతు సేవా కేంద్రంలో పనిచేసే విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు గత నెల 28న అనంత జేడీఏ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. పలువురు సిబ్బందికి మంచి ర్యాంక్ ఉన్నా వారు అడిగిన స్థానాలు కేటాయించలేదు. దీంతో తమకు మంచి ర్యాంక్ ఉన్నా, అడిగిన మూడు ఆప్షన్లల్లో ఏ ఒక్క స్థానం ఇవ్వకుండా అన్యాయం చేశారంటూ శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన 11 మంది అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఈనెల 14న హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. ప్రస్తుతం సిబ్బంది పనిచేస్తున్న స్థానాల్లోనే రెండు వారాల పాటు కొనసాగించాలంటూ ఈనెల 15న హైకోర్టు స్టేటస్‌కో ఆర్డర్ ఇచ్చింది. దీన్ని ఉద్యోగుల తరపు న్యాయవాది ఈనెల 17న అనంత జేడీఏ కార్యాలయంలో అందజేసినట్లు సమాచారం. అయితే తమకు కోర్టు ద్వారా నేరుగా ఉత్తర్వులు రాలేదన్న కారణంతో సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోలేదని సమాచారం. శుక్రవారం జరిగిన విచారణకు జేడీఏ కార్యాలయం నుంచి ఓ అధికారిని పంపారు. అయితే స్టేటస్ కో ఆర్డర్ మేరకు సంబంధిత అధికారులకు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని సమాచారం. బదిలీల్లో అన్యాయం చేయడంతోపాటు స్టేటస్ కో ఆర్డర్‌ను అమలు చేయలేదన్న విషయాన్ని న్యాయవాది జడ్జి దృష్టికి మరో సారి తాజా పరిస్థితిని తీసుకువెళ్లినట్లు తెలిసింది.

ప్రతి సమస్యకూ పరిష్కారం చూపిస్తాం

'మీ సమస్య.. మా బాధ్యత'లో పరిటాల శ్రీరామ్


ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తూ, సమస్యలను తెలుసుకుంటున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకూ తప్పక పరిష్కారం చూపిస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. పట్టణంలోని శివానగర్, కేశవనగర్‌లో శుక్రవారం 'మీ సమస్య.. మా బాధ్యత' పేరిట వినూత్న కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు. శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకుని, అక్కడే ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కేశవనగర్‌లో గ్రీవెన్స్ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, మున్సిపల్, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.ప్రజల సమస్యలలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ, సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో తమ దృష్టికి అనేక సమస్యలు వచ్చాయని అన్నారు. వాటిని పరిష్కరించే బాధ్యతను తీసుకుంటామని అన్నారు. సచివాలయ స్థాయిలో ఉన్నవి ఇక్కడే పరిష్కరిస్తామని, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తామని అన్నారు. వైసీపీ హయాంలో నిర్ణయాలవల్ల పింఛన్లు, ఇంటి స్థలాల పట్టాల విషయంలో అక్రమాలు జరిగాయని, అర్హులకు అన్యాయం జరిగిందని అన్నారు. పరిశీలించి, న్యాయం చేస్తామని అన్నారు. అమరావతి గురించి మాట్లాడే నైతిక హక్కు మాజీ సీఎం జగన్‌కు లేదని విమర్శించారు. వారి ఎమ్మెల్యేలతో కలిసి అక్కడ పర్యటిస్తే జరిగిన అభివృద్ధి ఏమిటో తెలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఏపీసీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి చింతలపల్లి మహేశ్ చౌదరి, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, 7వ వార్డు ఇన్‌చార్జి పల్లపు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్యా..! పిల్లలు దొరికేశారు

స్కూల్ నుంచి వెళ్లిపోయిన విద్యార్థులు సేఫ్

తిరుమల నుంచి తీసుకొస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం/విద్య, జూలై 25(ఆంధ్రజ్యోతి): స్కూల్ నుంచి వెళ్లిపోయిన విద్యార్థులను అనంతపురం పోలీసులు గుర్తించారు. రాత్రింబవళ్లు శ్రమించి శుక్రవారం తిరుమలలో ఉన్నట్లు గుర్తించి అనంతపురం తీసుకొస్తున్నారు. కూడేరు, నార్పల, గార్లదిన్నె, గోరంట్ల మండలాలకు చెందిన విద్యార్థులు నగరంలోని మూడో రోడ్డులో ఉన్న బీసీ హాస్టల్‌లో ఉంటూ పొట్టి శ్రీరాములు స్కూల్‌లో చదువుకుంటున్నారు. ఎప్పటిలాగే గురువారం పాఠశాలకు వెళ్లారు. అయితే అక్కడి నుంచి టీచర్ల కళ్లుకప్పి బయటకు వెళ్లి పోయారు. బడి వదిలిన తర్వాత విద్యార్థులు హాస్టల్‌కు వెళ్లలేదు. రాత్రి పొద్దుపోయినా రాకపోవడంతో కపోవడంతో విద్యార్థుల ఇళ్లకు ఫోన్ చేసి ఆరా తీశారు. అక్కడికి రాలేదని తెలియడంతో త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వార్డెన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ విద్యార్థుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. బెంగళూరు, తిరుపతి నగరాలకు వెళ్లిన రెండు బృందాల పోలీసులు ముమ్మరంగా గాలించారు. ఎట్టకేలకు టెక్నాలజీ సాయంతో విద్యార్థులు తిరుమలలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడి పోలీసుల సహకారంతో ఆ విద్యార్థులను గుర్తించి మూడో పట్టణ పోలీసులు శుక్రవారం దగ్గరకు తీసుకున్నారు. తిరుమల నుంచి అనంతపురం బయల్దేరారు. విద్యార్థుల ఆచూకీ కనిపెట్టడంపై సీఐ శాంతిలాల్ మాట్లాడుతూ ముగ్గురు పోలీసులను తిరుమలకు పంపి వెతికించామని పేర్కొన్నారు. సీసీ కెమెరాల్లో పరిశీలించి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి గుర్తించినట్టు తెలిపారు. విద్యార్థులను గుర్తించడంతో అటు తల్లిదండ్రులు, ఇటు పోలీసులు, హాస్టల్, స్కూల్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

సామాజిక బాధ్యతకు తూట్లు..!

నంబులపూలకుంట, జూలై25(ఆంధ్రజ్యోతి): నంబులపూలకుంట, పి.కొత్తపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో రోడ్ల నిర్మాణానికి సీఎస్‌ఆర్ నిధులు రూ.మూడు కోట్ల చొప్పున ఇచ్చారు. మురుగు కాలువలు లేకుండానే రోడ్లు వేసి, మమ అనిపించారు. ఎగువ ప్రాంతాల్లో నివాసాల వారు మురుగునీరు రోడ్డుపైకి వదులుతుండడంతో దిగువన ఉన్నవారు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీటితో దోమలు అధికమై, వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఆ రోడ్లపై నడవాలంటే బురద తొక్కాల్సిందే. వాహనాలు వెళ్తే మురుగునీరు ఇళ్లలోకి, పాదచారులపై పడుతుండడంతో ఆందోళన చెందుతున్నారు.

ప్రారంభానికి ముందే..

ఎల్‌ఏడీఎఫ్ నిధులతో చేపట్టిన ఆర్వో ప్లాంట్ల నిర్మాణాల గురించి చెప్పక్కర్లేదు. అన్ని ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు బిగించారే తప్ప.. విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. త్వరలో ప్రారంభించాల్సి ఉంది. నేలపై బెడ్డింగ్ సరిగా లేకపోవడంతో పగిలిపోయింది. ఎంత వ్యయంతో ప్లాంట్ల నిర్మాణం చేపట్టారన్న వివరాలు నోటీసు బోర్డులో కూడా పొందుపరచకపోవడం గమనార్హం. పి.కొత్తపల్లి పంచాయతీ పరిధి ఎగువ తూపల్లి ఎస్సీ కాలనీలో ఆర్వో ప్లాంటు చెరువు ప్రాంతంలో ఏర్పాటు చేశారు. చెరువులోకి నీరు వస్తే ఆర్వో ప్లాంటు మునిగిపోతాయి. నాసిరకంగా, అనువుగాని చోట నిర్మాణాలు చేపట్టి, నిధులు బొక్కేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వెలగని సోలార్ వీధిదీపాలు

నంబులపూలకుంట, పి.కొత్తపల్లి, పెడబల్లి పంచాయతీల్లో దాదాపు వందకిపైగా సోలార్ వీధిదీపాలు వెలగడంలేదు. ఒక్కో విద్యుత్ దీపానికి రూ.వేలు వెచ్చించి ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు ఏర్పాటు చేశారు. ఏడాది కూడా తిరక్కుండానే అవి వెలగట్లేదు. దీంతో స్తంభాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. పంచాయతీ అధికారులను అడిగితే తమకు తెలియదు అంటున్నారు. వెలగని వీధిదీపాల స్థానంలో ప్రత్యామ్నాయంగా ఏర్పాటు కూడా చేయట్లేదు.


నాణ్యంగా నిర్మాణాలు చేపట్టాలి



సీఎస్‌ఆర్ నిధులతో చేపట్టే నిర్మాణాలు నాణ్యగా ఉండాలి. పూర్వం నుంచి సాగుచేసుకుంటున్న భూములను సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు రైతులు ఇచ్చారు. ఊర్లలోని అందరూ బాగుంటారని త్యాగం చేశారు. వారి త్యాగాల ఫలితంగా లభించే సీఎస్‌ఆర్ నిధులతో చేపట్టే ఆర్వో ప్లాంట్ల నిర్మాణంలో నాణ్యతకు తిరోదకాలిస్తున్నారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి తాగునీరు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాలి. అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి, పనులు నాణ్యతగా చేపట్టాలి.

- గంగిరెడ్డి, రైతు సంఘం మండల కార్యదర్శి

పాఠశాల భవనం నిర్మించాలి




మా గ్రామంలో ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. సోలార్ పార్కు సీఎస్‌ఆర్ నిధులతో నూతన భవనాన్ని నిర్మించాలి. ప్రసిద్ధిగాంచిన వీరభద్రస్వామి ఆలయ నిర్మాణం చేపట్టాలి.

- నరసింహులు, వంకమద్ది

నేటి ప్రముఖులు

పోర్టరైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కౌంపు...

జార్జ్ బెర్నార్డ్ షా (జయంతి)



ఐరిష్ దేశానికి చెందిన సాహితీవేత్త జార్జ్ బెర్నార్డ్ షా 1856 జూలై 26న డబ్లిన్‌లో జన్మించారు. 20వ యేట లండన్‌కు వెళ్లి తన జీవితమంతా అక్కడే గడిపారు. 60కుపైగా నాటకాలు రాశారు. ప్రపంచంలో నోబెల్ పురస్కారంతోపాటు ఆస్కార్ అవార్డు పొందిన ఏకైక వ్యక్తిగా నిలిచారు. సీజర్ అండ్ క్లియోపాత్ర, మ్యాన్ అండ్ సూపర్ మ్యాన్, మేజర్ బార్బరా, హార్ట్‌బ్రేక్ హౌస్ తదితర రచనలు ఎంతో పేరొందాయి. రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలను స్పృశిస్తూ రచనలు చేశారు. 1950 నవంబరు 2న కన్నుమూశారు.

గోరా శాస్త్రి (వర్ధంతి)



సంఘసంస్కర్తలలో ఒకరై 'గోరా'గా పేరొందిన గోపరాజు రామచంద్రరావు 1902 నవంబరు 15న ఒడిశా రాష్ట్రం ఛత్రపురంలో జన్మించారు. సమాజంలో వర్ణ వ్యవస్థ, అంటరానితనంపై యుద్ధాన్ని ప్రకటించి 1940లో ప్రపంచంలో తొలి నాస్తిక కేంద్రాన్ని స్థాపించారు. సంఘం, ఆర్థిక సమత అనే పత్రికలు నిర్వహించారు. ఎన్నో రచనలు చేశారు. మహాత్మాగాంధీతో చర్చించి అస్పృశ్యత నిర్మూలన కోసం కృషి చేశారు. సాంఘిక సమానత్వ సాధనకు కృషి చేశారు. 1975 జూలై 26న కన్నుమూశారు. 2002 లో ఆయన శతజయంతి సందర్భంగా ప్రత్యేక పోస్టల్‌స్టాంపు విడుదల చేశారు.

మైనర్లు బైక్ నడిపితే తల్లిదండ్రులపై చర్యలు

● సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ వర్ణి హెచ్చరిక

బాగేపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): మైనర్లు బైక్ లేదా స్కూటర్ నడిపితే వారి తల్లిదండ్రులపై కఠిన చర్యలు తప్పవని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ వర్ణి హెచ్చరించారు. పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులనుంచి శుక్రవారం 34 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తొలిసారిగా హెచ్చరిక ఇస్తూ వాహన లైసెన్స్, ఆర్‌సీ తీసుకుని రూ.వెయ్యి జరిమానా విధిస్తున్నట్టు తెలిపారు. కనీస పరిజ్ఞానం లేకుండా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైతే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. పీయూ చదివేవేళ ఆ వయసులో బైక్ నడపడం థ్రిల్‌గా అనిపిస్తుందన్నారు. పిల్లల భవిష్యత్తుపై పెద్దలు ఎన్నో కలలు కంటారని, అయితే నిర్లక్ష్యం కారణంగా వారి కలలు కల్లలుగా మారిపోతున్నాయన్నారు. అలాగే పెద్దలు కూడా ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిగి ఆ విధంగా మెలగాలన్నారు. లేకుంటే పిల్లలు బైక్‌లు నడిపితే పెద్దలు జైలు ఊచలు లెక్కించాల్సి ఉంటుందన్నారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం 18ఏళ్లలోపుకంటే తక్కువ వారికి బైక్‌లు, స్కూటర్‌లు ఇవ్వరాదన్నారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. ఆర్‌సీ రద్దు కావడంతోపాటు తల్లిదండ్రులకు రూ.25వేల జరిమానా, మూడేళ్ల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. డీఎల్ లేకుండా వాహనాలు నడిపిన బాలనేరస్తులకు కూడా జరిమానాతోపాటు రిమాండ్ హోంకు వెళ్లే పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది సునీల్, కిరణ్‌నాయక్, శ్రీపతి, బసవరాజు, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐ ప్రశాంత్‌వర్ణి

విద్యార్థులకు లక్ష్యం తప్పనిసరి: జేసీ



యూనిఫాంతో విద్యార్థులు

బంగారుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ గురువులపట్ల గౌరవం ఇవ్వడంతోపాటు గురువుల మార్గదర్శకంలో ఉన్నతలక్ష్యాన్ని సాధించాలని శనేశ్వర విద్యాసంస్థ జాయింట్ కార్యదర్శి సత్యభామ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని శనేశ్వర కన్నడ ప్రాథమికోన్నత ఎయిడెడ్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఆర్కాట్ చంద్రణ్ణ జ్ఞాపకార్థం సంస్థ సహకార్యదర్శి సత్యభామ కుటుంబ సభ్యులు 1నుంచి ఏడో తరగతి విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు హెచ్ఎల్ ఆనంద మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల మాదిరిగా ఎయిడెడ్ పాఠశాలలకు సదుపాయాలు ఉండవన్నారు. దాతలు, పూర్వ విద్యార్థులు సహకారం అందిస్తున్నారని చక్కగా చదువుకుని ప్రయోజకులు కావాలని పిలుపునిచ్చారు. దాతలు ఆర్కాట్ చంద్రణ్ణ, సత్యభామలు తమ పాఠశాలకు ఒక తరగతిగదిని ఉచితంగా నిర్మించారన్నారు. 20ఏళ్లుగా క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం విద్యార్థులందరికీ ఉచితంగా యూనిఫాం సమకూరుస్తున్నారని అభినందించారు. రిటైర్డు టీచర్ రంగణ్ణ మాట్లాడుతూ చదివిన పాఠశాలను మరిచిపోరాదని విద్యార్థులకు హితవు పలికారు. కార్యక్రమంలో టీచర్లు జ్యోతి, గిరిజమ్మ, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

అండాణువుల సంరక్షణకు పెరిగిన ప్రాధాన్యం

బెంగళూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): అండాణువుల సంరక్షణ అనే కొత్త పద్ధతికి ప్రాధాన్యత పెరుగుతోందని రాధాకృష్ణ మల్టిస్పెషాలిటీ ఆసుపత్రి ఐవీఎఫ్ సెంటర్ మెడికల్ డైరెక్టర్ విద్యాభట్ అభిప్రాయపడ్డారు. ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ వర్చువల్ రూపంలో మీడియాతో మాట్లాడారు. ప్రధానంగా వృత్తిపరమైన మహిళలు సంతానోత్పత్తి కోసం ప్రణాళికలు చేసుకుంటున్నారన్నారు. అటువంటి వారు అండాణువుల సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ వంటి మెట్రో నగరాలలో ఈ అంశంపై మహిళలు శ్రద్ధ చూపుతున్నారన్నారు. వయసు పైబడుతున్నవారికి సంతోనోత్పత్తి సమస్యలు తలెత్తుతాయనే ముందుగా అండాణువులను సంరక్షించుకుంటున్నారన్నారు. ఇటీవల ఐదేళ్లుగా ఈ అంశంపై అవగాహన పొందేందుకు మహిళలు ఐవీఎఫ్ సెంటర్‌లను ఆశ్రయించేవారు పెరిగారన్నారు. ప్రతి దంపతులకు సొంత బిడ్డ కావాలనే ఆశయం ఉంటుందని అందుకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారన్నారు.

కళ్లజోడు విషయంలో నిర్లక్ష్యం సరికాదు

బెంగళూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): కళ్లజోడు విషయంలో నిర్లక్ష్యం సరికాదని ఎప్పటికప్పుడు వైద్యుల సలహాలతోపాటు నాణ్యమైన వాటిని ఎంపిక చేసుకోవాలని జీకేబీ ఆప్టికల్స్ చీఫ్ సీఓఓ సుమిత్ దత్తా అభిప్రాయపడ్డారు. ఎంజీ రోడ్డులో జీకేబీ ఆప్టికల్స్‌ను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమిత్ దత్తా మాట్లాడుతూ పిల్లలకోసం మయోపియో క్లినిక్‌ను ఏర్పాటు చేశామన్నారు. వైడెక్స్ ఆడియాలజి జోన్, క్లినిక్‌తోపాటు లెన్స్ ఎక్స్‌పీరియెన్స్ జోన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. డైరెక్టర్ ప్రియాంక గుప్త మాట్లాడుతూ నగరంలో ఆప్టికల్స్ ఏర్పాటు చేయడాన్ని సంతోషంగా భావిస్తున్నామన్నారు. వినియోగదారులు ఒక షాపింగ్ అనుభవాన్ని పొందవచ్చునన్నారు. సేల్స్ వైస్‌ప్రెసిడెంట్ అజయ్‌మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యం సాధించాలి

» రేవా వీవీ అకడమిక్ ప్రారంభంలో అరిహంత్‌జైన్

బెంగళూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు యూనివర్సిటీలో చదివేటప్పుడు నైపుణ్యం సాధించాలని, సౌలభ్యాలను సద్వినియోగం చేసుకోవాలని డబ్ల్యుఎల్‌డీడీ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ అరిహంత్ జైన్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం రేవా యూనివర్సిటీలో 2025-26 అకడమిక్‌ను లాంఛనంగా ప్రారంభించారు. నాన్ టెక్నికల్ కోర్సుల కొత్త బ్యాచ్ తరగతులను ప్రారంభించారు. రేవా యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ పీ శ్యామరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అరిహంత్ జైన్ మాట్లాడుతూ సాంకేతిక రంగం ఎప్పటికప్పుడు మారుతోందని ఆ దిశగా నైపుణ్యత సాధించాలన్నారు. చదివేటప్పుడు అవకాశాలను వినియోగించుకుంటే ఆ తర్వాత మీ ప్రతిభకు తగిన ఉద్యోగాలు సాధ్యమవుతాయన్నారు. మార్వాడీ విశ్వవిద్యాలయం వన్ ఫైనాన్స్ వ్యవస్థాపకులు, ఎండీ జీత్ మార్వాడీ మాట్లాడుతూ పాఠ్యాంశాలను అర్థపూర్ణంగా తెలుసుకోవాలన్నారు. చదువు ఉద్యోగం కోసం కాదని, సాధన కోసమని భావించాలన్నారు. చాన్సలర్ మాట్లాడుతూ రేవా యూనివర్సిటీ విద్యార్థులలో ఆలోచనా శక్తిని పెంపొందించే దిశగా పాటుపడుతోందన్నారు. ఎడ్యుకేట్ టు ఎంటర్‌ప్రైజెస్ దృష్టితో ఆధునికతను తొలిరోజునుంచే విద్యార్థులకు తగిన బోధనలు ఇస్తున్నామన్నారు. అకడమిక్‌లోనే సాంకేతిక ఆలోచనలకు తగినట్టుగా ఎప్పటికప్పుడు సాంకేతిక ప్రదర్శనలలో భాగస్వామ్యులను చేస్తున్నామన్నారు. రేవా మూలసిద్ధాంతం ఎడ్యుకేట్ టు ఎంటర్‌ప్రైజెస్‌గా ఉందన్నారు. ఏఐ ఆధారిత సమాజంలో విద్య సంప్రదాయక డిగ్రీలను మించి ఉండాలని నమ్ముతున్నామన్నారు. కార్యక్రమంలో కులపతి డాక్టర్ సంజయ్ చిట్నీస్, డాక్టర్ కేఎస్ నారాయణస్వామి, ప్రో-వైస్‌చాన్సలర్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న డబ్ల్యుఎల్‌డీడీ సీఈఓ అరిహంత్ జైన్, రేవా వర్సిటీ చాన్సలర్ డాక్టర్ పి.శ్యామరాజు తదితరులు

బకాయిల వసూళ్లకు చర్యలు



దుకాణదారులను హెచ్చరిస్తున్న నగరసభ కమిషనర్ చలపతి

చింతామణి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేఎస్ఆర్టీసీ బస్టాండ్ సమీపాన గల ఐడీఎస్ఎంటీ మార్కెట్‌లోనూ, ఎస్ఎల్ఎన్ థియేటర్ సమీపాన గల దుకాణాల సముదాయం, నగరసభకు చెందిన దుకాణాల సముదాయాలనుంచి లక్షలాది రూపాయల బాడుగ బకాయి ఉండడంతో నగరసభ కమిషనర్ స్వయంగా రంగంలోకి దిగారు. నగరసభ రెవెన్యూ విభాగం అధికారి మునియప్ప నేతృత్వంలో కార్యాచరణ నిర్వహించారు. 2021 నుంచి బాడుగ బకాయిలు ఉన్నట్టు గుర్తించి హెచ్చరికలు జారీ చేయగా మరికొన్ని దుకాణాలకు తాళం వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ లీజు గడువు ముగిసిన దుకాణ దారులనుంచి బాడుగ బకాయి ఉందన్నారు. ఐడీఎస్ఎంటీలో 198 దుకాణాలు, నగరసభకు చెందిన 99 దుకాణాలనుంచి కోటి రూపాయలకు బకాయి ఉందన్నారు. జిల్లా అధికారి సూచన మేరకు కార్యాచరణ చేపట్టామని, కొన్నేళ్లుగా బాడుగ చెల్లించని దుకాణాలకు తాళం వేసినట్టు తెలిపారు. కార్యాచరణలో నగరసభ అధికారులు సీకే బాబు, ఆరతి, సిబ్బంది శంకర్, చలపతి తదితరులు పాల్గొన్నారు.



దుకాణానికి తాళం వేస్తున్న సిబ్బంది

డిజిటల్ సేవలకు చేయూత

» గ్రామ పాలనాధికారులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

శిడ్లఘట్ట, జూలై 25(ఆంధ్రజ్యోతి): డిజిటల్ సేవలు మెరుగు చేసేందుకు పట్టణంలోని తాలూకా కార్యాలయంలో గ్రామపంచాయతీ పాలనాధికారులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ తాలూకాలో తొలివిడలో 19మంది గ్రామ పాలనాధికారులకు ల్యాప్‌టాప్‌లు అందచేశామన్నారు. రెవెన్యూశాఖ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఏడుకోట్లమందికి గొప్ప సేలందిస్తోందన్నారు. రైతులు, గ్రామస్తులు వీటి ప్రయోజనాలు పొందుతున్నారన్నారు. తద్వారా డిజిటల్ సేవలకు చేయూత ఇచ్చేలా పాలనాధికారులకు ల్యాప్‌టాప్‌లు సమకూరుస్తున్నామన్నారు. తద్వారా వారి కార్యవైఖరి మరింత పెంచదలిచామన్నారు. రెవెన్యూ రికార్డులు, సర్వే సవరణలు, పహణి, పబ్లిక్ ఖాతాలు తదితర సేవలు మరింత వేగిరం చేసేలా ల్యాప్‌టాప్‌లు అందచేస్తున్నామన్నారు. తహసీల్దార్ గగనసింధు మాట్లాడుతూ డిజిటల్ కర్ణాటకలో భాగంగా రెవెన్యూ సేవలు మరింత సరళీకృతం చేస్తున్నా మన్నారు. రెవెన్యూశాఖలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని భూరికార్డులను ఆన్‌లైన్ వ్యవస్థలోకి తెస్తున్నారన్నారు. ఇందులో భాగంగా భూ సురక్షా పబ్లిక్ ఖాతా సేవలు అన్నీ డిజిటల్ అవుతాయన్నారు. గ్రామీణస్థాయిలో సమాచార నిర్వహణ, రికార్డులకోసం గ్రామ పరిపాలనాధికారులకు ల్యాప్‌టాప్‌లు ఉపయుక్తం కానున్నాయన్నారు. తద్వారా డిజిటల్ కర్ణాటక కల సాకారం కానుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పాలనాధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

శక్తిదేవత ఆలయంలో విశేష పూజలు

శిడ్లఘట్ట, జూలై 25(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని దొడ్డచోకండహళ్ళి గ్రామంలోని శక్తిదేవత ఆలయంలో భీమన అమావాస్య పురస్కరించుకుని విశేషపూజలు, హోమాలు జరిగాయి. మునేశ్వరస్వామి, ఆదిశక్తి అథవర్ణ మలయాళ భద్రకాళి అమ్మ, అగోర స్మశాన కాటేరమ్మ, చౌడేశ్వరి దేవి దేవాలయంలో భక్తాదులు ఉదయం నుంచే ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. చాలామంది భక్తులు ఆలయం చుట్టూ 9 ప్రదక్షిణలు చేసి అనంతరం సమీపంలోని ఒక చెట్టుకు టెంకాయను కట్టి మొక్కులు తీర్చుకున్నారు. విశేషపూజల అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

బసవరాజ్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

● మాజీ ఎమ్మెల్యే పాపారెడ్డి నివాళి

రాయచూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధిగా పార్టీ నాయకుడిగా కుటుంబ పెద్దగా మున్నూరుకాపు సమాజంలో ప్రముఖ వ్యక్తిగా దివంగత గంగనగార్ బసవరాజ్ రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని మున్నూరుకాపు సమాజం సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఎ పాపారెడ్డి కీర్తించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సుదీర్ఘ కాలం పాటు పని చేసిన జీ బసవరాజ్ రెడ్డి వివాద రహితుడిగా అందరిని సమానంగా చూసే ఆప్తుడిగా అందరి గుండెల్లో చిరస్థాయిగా స్థానం సంపాదించారని అన్నారు. బసవరాజ్ రెడ్డి సంస్మరణ సభను శుక్రవారం నగరంలోని మాతా లక్ష్మీదేవి కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బసవరాజ్ రెడ్డి చిత్రపటానికి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, మున్నూరుకాపు సమాజం ప్రముఖులు పూజమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్న పలువురు నాయకులు వ్యక్తిగతంగా ఆయనతో ఉన్న తమ అనుబంధాలను గుర్తు చేసుకుంటు కన్నీటిపర్యంతమైయ్యారు. వారి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని వారి ఆత్మకు శాంతి చేకురాలలని ప్రార్థిస్తున్నట్లు నాయకులు తెలిపారు.

ప్రతిపాదనలే లేవు..!

● తుంగభద్ర జలాశయం పూడికతీతపై ప్రశ్నించని రాష్ట్ర ప్రభుత్వం

● లిఖిత పూర్వకంగా కేంద్ర మంత్రి ప్రకటన



లోక్‌సభలో ఎంపీ కుమార్ నాయక్

రాయచూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాయచూరుతో పాటు మరో మూడు జిల్లాల రైతులకు జీవనాడిగా ఉన్న తుంగభద్ర జలాశయంలో పూడాక తీత తీసే అంశం మరో సారి బయటకు వచ్చింది. ఇందుకు సంబంధించి శుక్రవారం లోకసభలో రాయచూరు లోక్‌సభ సభ్యుడు జీ కుమార్ నాయక్ అడిగిన ప్రశ్నకు కేంద్ర జలవనరుల మంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. జలాశయం పూడికతీత పై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రతిపాదన రాలేదని మంత్రి స్పష్టం చేశారు. అదే సమయంలో తుంగభద్ర ఎడమకాలువ మరమ్మత్తులు లీకేజిల నియంత్రణ తదితర అంశాలకు సంబంధించిన ఇప్పటికే ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు వచ్చాయని వీటికి కేంద్ర ప్రభుత్వంతో పాటు ఏడీబీ, వరల్డ్ బ్యాంక్ సహాయంతో పనులను చేపట్టే అవకాశం ఉందన్నారు. కాగా తుంగభద్ర జలాశయం పూడిక తీత పనిని దాదాపు రాష్ట్ర ప్రభుత్వం పక్కన పెట్టినట్టే దీంతో బహిర్గతమైంది. ఇందుకు ప్రత్యమ్నంగా నవలి వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వర్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందుకోసం పొరుగు రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులతో చర్చలు జరపాల్సి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

వ్యాధిని గుర్తించడమే కీలకం

● జేసీఐ అల్యూమిని క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్



శిబిరంలో రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేత

విజయపుర, జూలై 25(ఆంధ్రజ్యోతి): రోగాల బారినపడి బాధపడడం కంటే ముందుగా గుర్తిస్తే తగిన వైద్యంతో ఆరోగ్యం పొందడం సాధ్యమని జేసీఐ అల్యూమిని క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్ అభిప్యాపడ్డారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణం సమీపాన బీడిగానహళ్ళిలో వివిధ సంఘాలతో ఏర్పాటైన ఉచిత వైద్య పరీక్షా శిబిరం జరిగింది. జేసీఐ అల్యూమిని క్లబ్, ధర్మస్థళ గ్రామాభివృద్ధి యోజనె సహకారంతో ఉచిత నేత్ర పరీక్షా శిబిరం, బీపీ, మధుమేహం పరీక్షలు నిర్వహించారు. రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసినవారికి ప్రశంసాపత్రాలు అందచేసి అభినందించారు. శిబిరంలో దృష్టి కంటి ఆసుపత్రి డాక్టర్ సంజయ్, డాక్టర్ మధుసూధన్, సిబ్బంది పాల్గొని 67మందికి పరీక్షలు చేశారు. శిబిరంలో మొత్తం 250మందికిపైగా పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో సేకరించిన 60 యూనిట్ల రక్తాన్ని లయన్స్ క్లబ్ యలహంకకు తరలించారు. కార్యక్రమంలో గ్యారెంటీ అమలు కమిటీ జిల్లా అధ్యక్షుడు బీ రాజణ్ణ, దేవనహళ్ళి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేసీ మంజునాథ్, తూబగెరె బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవి సిద్దయ్య, బెంగళూరు విమానాశ్రయ ప్రాధికార అధ్యక్షుడు శాంతకుమార్, వివిధ గ్రామాల పంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో యువతపాత్ర కీలకం

● మఠాధిపతి నిర్మలానందనాథ స్వామీజీ



సత్సంగంలో నిర్మలానందనాథ స్వామీజీ తదితరులు

శిడ్లఘట్ట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రగతికోసం యువత తమవంతుపాత్ర కృషి చేయాలని ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథస్వామిజీ అభిప్రాయపడ్డారు. పట్టణ శివారులోని హండిగనాళ వద్ద బాలాజి కన్వెన్షన్‌హాల్ ఏర్పాటైన సత్సంగ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సమాజంలో సామాజిక క్రాంతి, ఉత్తమ మార్పు, అభివృద్ధిని గమనిస్తే పూర్వ విద్యార్థులు, యువత పాత్ర ఎంతో ఉందన్నారు. యువతను మంచి మార్గంలో నడిచేలా తల్లులపాత్ర ఎంతో ఉందన్నారు. పిల్లలతో తండ్రికంటే తల్లితో ఎక్కువ అనుబంధం ఉంటుందని, అలాగే వారి తీరుపై తల్లి నిఘా ఉంటుందన్నారు. జాతీయ కవి కువెంపు యుగకవిగా ఎదిగేందుకు ఆయన తల్లి చూపిన మార్గదర్శకమేనన్నారు. ఈ విషయాన్ని కువెంపు పలుమార్లు తనజీవితం ఎదుగుదలలో తల్లిపాత్ర ఎక్కువగా ఉందని ప్రస్తావించారన్నారు. మన సంస్కృతిలో వ్యాసపూర్ణిమకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. తల్లి తర్వాత గురువుకు అంత ప్రాధాన్యత ఇచ్చారన్నారు. గురువు మార్గదర్శకం లేకుండా ఎలాంటి అడుగు సాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో మఠం భక్తులు సహనా రాజీవ్‌గౌడ, రాణి సీకల్ రామచంద్రగౌడ, పాలుణ్య సచిన్, అరుణ పుట్టు ఆంజినప్ప, మాజీ ఎమ్మెల్యే ఎం రాజణ్ణ దంపతులు, వందలాదిమంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, గౌరిబిదనూరు ఎమ్మెల్యే కేహెచ్ పుట్ట స్వామిగౌడ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీకల్ రామచంద్రగౌడ, కేపీసీసీ కన్వీనర్ రాజీవ్‌గౌడ, కాంగ్రెస్ నేత పుట్టు ఆంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

మైసూరుకు బయల్దేరిన ఉద్యోగులు



బస్సువద్ద సంఘం సభ్యులు, పదాధికారులు

ముళబాగిలు, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్‌డీపీఆర్ ఎస్సీ, ఎస్టీ అధికారులు, ఉద్యోగులసంఘం బెంగళూరు నేతృత్వంలో మైసూరులోని సెనేట్ భవనం మానసగంగోత్రిలో రాష్ట్రస్థాయి సమావేశం ఈనెల 26, 27 తేదీలలో జరగనుంది. సమావేశానికి ముళబాగిలు, కోలారులనుంచి సుమారు 150 మంది శుక్రవారం బయల్దేరారు. బృందంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటాచలపతి, గౌరవాధ్యక్షుడు అశ్వథ్ నారాయణ, రాష్ట్ర పరిషత్ సభ్యుడు రామకృష్ణప్ప, సీవీ నారాయణస్వామి, రమేశ్‌బాబు, శంకర్, మంజునాథ్ తదితరులు ఉన్నారు.

బీజేపీ యువ నాయకుడికి జిల్లా బహిష్కరణ

రాయచూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మహానగర పాలిక 1వ వార్డు సభ్యుడి కుమారుడు బీజేపీ యువ నాయకుడు రోనాల్డ్ అగస్టీన్ అలియాస్ సన్నిని 6 నెలల పాటు జిల్లా బహిష్కరణ శిక్ష విధిస్తు రాయచూరు సహాయ కమిషనర్ గజానన బాళె శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. పోలీసు అధికారుల పై దాడితో పాటు పలు అసాంఘిక కార్యకలాపాల్లో భాగస్వామిగా ఉన్న రోనాల్డ్ అగస్టీన్ అలియాస్ సన్ని, ప్రజలను భయభ్రాంతులను చేసే పలు కార్యక్రమాల్లో పాల్గొంటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించారన్న ఆరోపణల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆరోపణలపై విచారణ జరిపి తుది నిర్ణయం తీసుకునే సందర్భంగా నిందితుడు హాజరు కాకపోవడం ఎలాంటి అభ్యంతరాలు తెలపకపోవడంతో ఆయనను ఈ నెల 21వ తేదీ నుంచి 2026 జనవరి 27వ తేదీ వరకు జిల్లాలో ప్రవేశించరాదంటూ చామరాజనగర జిల్లా హనూరు తాలూకా రామపురు స్టేషన్‌కు బహిష్కార శిక్ష విధిస్తు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.48	1,631.91
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	26,478	75,810
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	28,246	23,469
నీటి నిల్వ (టీఎంసీలు)	79.07	101.42



తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రుతి

అక్రమంగా రాళ్ల తవ్వకం

● 9మందిపై కేసు నమోదు

బళ్లారి సిటీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హొసపేట తాలూకాలోని కల్లట్ట గ్రామ సమీపంలో అక్రమంగా రాతి తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తించిన గ్రామీణ పోలీసు అధికారులు 9మందిపై కేసు నమోదు చేశారు. గనులు, భూగర్భ శాస్త్ర శాఖ అధికారుల ఫిర్యాదు ఆధారంగా తాలూకాలోని బవన్ దుర్గ గ్రామానికి చెందిన రవి కుమార్, ఖాసీంసాబ్, మంజునాథ్, వజ్రవేణి, సుబ్రహ్మణి, బాలరాజ్, ఆర్ముగం, శ్రీనివాసులపై కేసు నమోదు చేశారు. వారందరూ ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వారికోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. రాళ్ల ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత హంపి సమీపంలో అక్రమ రాతి తవ్వకం జరుగుతున్నట్లు సమాచారం అందింది. తహసీల్దార్ శ్రుతి సంఘటనస్థలాన్ని పరిశీలించి నిందితులపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు



బంకులను తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

బళ్లారి గాంధీనగర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజ్‌కుమార్ రోడ్డు జిల్లా ఆసుపత్రి నుంచి లోకాయుక్త కార్యాలయం వరకు ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసుకున్న అక్రమ దుకాణాలను శుక్రవారం వారం కార్పొరేషన్ సిబ్బంది తొలగించారు. అనంతపురం, గుంతకల్లు, ఉరవకొండ, ఆంధ్రవైపు వెళ్లే బస్సుల కోసం వేచి చూస్తుంటారు. అయితే ఆ ప్రాంతంలో నిర్మించిన ఫుట్‌పాత్‌లపై అక్రమంగా బంకులు ఏర్పాటు చేసుకుకోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో నగర ట్రాఫిక్ విభాగం పోలీసులు , కార్పొరేషన్ సిబ్బంది దుకాణాలు తొలగించారు. అయితే కొన్నేళ్ళ నుంచి ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు చేసుకుంటున్నామని, ఉన్నఫళంగా తొలగిస్తే ఎలా జీవించాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

కంప్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): కురుగోడు పట్టణంలో శుక్రవారం శిక్షణ శాఖ కళ్యాణ కర్ణాటక నిగమ అధ్యక్షురాలు సుచిత్ర అనసూయ, సిబ్బంది పట్టణంలో వివిధ పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పాఠశాలల్లో సమస్యలున్నాయని, అన్నింటిని పరిష్కరించేలా నిధులు మంజూరు చేస్తామన్నారు. అనంతరం పీఎంశ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ నూతన గదులకు నిధులు నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిక్షణ శాఖ అధికారి ఉమాదేవి, కురుగోడు తాలుకా శిక్షణ శాఖ అధికారి సిద్ద లింగమూర్తి, సీఆర్పీలు కళ్యాణ కర్ణాటక పాఠశాల శాఖ నిగమ సిబ్బంది, ఉపాధ్యాయులు, పట్టణ వాసులు తదితరులు పాల్గొన్నారు.

హిట్నాళ్‌కే కేఎంఎఫ్ అధ్యక్ష పీఠం

●ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ ●ఉత్కంఠ రేపినా ఏకగ్రీవంగా ముగిశాయి ● పంతం నెగ్గించుకున్న ఎమ్మెల్యేలు నాగేంద్ర, నారా



విలేకరులతో మాట్లాడుతున్న కేఎంఎఫ్ అధ్యక్షుడు హిట్నాళ్

బళ్లారి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాయచూరు, బళ్లారి, కొప్పళ, విజయనగర (రా.బ.కో.వి) కర్ణాటక మిల్క్ ఫెడరేషన్(కేఎంఎఫ్) అధ్యక్ష ఎన్నికలు కొన్ని నెలలుగా ఉత్కంఠను రేపినా చివరకు ప్రశాంతంగా ముగిశాయి. కేఎంఎఫ్ అధ్యక్షుడిగా కొప్పళ కాంగ్రెస్ ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాళ్, ఉపాధ్యక్షుడిగా రాయచూరు జిల్లా సింధనూరు తాలూకా కోటయ్య క్యాంపునకు చెందిన ఎస్. సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఏడీ ప్రమోద్ ప్రకటించారు. ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకూ ఎన్నికల ప్రక్రియను చేపట్టారు. 12 మంది డైరెక్టర్లు, 5 మంది నామినేటెడ్ ఓటర్ల మొత్తం 17 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 12 మంది డైరెక్టర్లు, ముగ్గురు నామినేటెడ్ ఓటర్లు హాజరయ్యారు. అధ్యక్ష పదవికి కొప్పళ ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాళ్ నామినేషన్ వేశారు. ఉపాధ్యక్షుడిగా ఎస్. సత్యనారాయణ నామినేషన్ దాఖలు చేశారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఒక్కొక్క నామినేషనే దాఖలు అయ్యాయి. దీనితో ఎన్నికల అధికారి వీరిని ఏకగ్రీంగా ఎన్నిక అయినట్లు ప్రకటించారు. రాయచూరు, కొప్పళ, బళ్లారి, విజయనగర జిల్లాల నుంచి రైతులు, పాలసంఘాల సభ్యులు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున వచ్చి సంబరాలు జరుపుకున్నారు.

రాత్రంతా హైడ్రామానే..

కేఎంఎఫ్ అధ్యక్ష ఎన్నిక ముందు రోజు అంటే గురువారం రాత్రంతా రాజకీయ హైడ్రామానే నడిచింది. డైరెక్టర్లు, పాల సంఘాల సభ్యులు అన్ని జిల్లాల నుంచి బళ్లారికి తరలి వచ్చారు. మాజీ కేఎంఎఫ్ అధ్యక్షుడు కూడా రాత్రి వరకు నగరంలోని ఓ లాడ్జిలో మకాం వేశారు. కేఎంఎఫ్ అధ్యక్షపదవికి పలువురు పోటీ పడ్డారు. కానీ అనూహ్యంగా కొప్పళ ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాళ్‌ను రంగంలోకి దించారు. ఎమ్మెల్యేని ఏకంగా పోటీలో దింపడం, పైగా ఆయన సీఎం సిద్దరామయ్య కు అత్యంత సన్నిహితుడు కావడంతో పోటీ ఏకగ్రీవంగా ముగిసింది.

చక్రం తిప్పిన బళ్లారి నేతలు

కేఎంఎఫ్ ఎన్నికల్లో మాజీ మంత్రి బి. నాగేంద్ర, బళ్లారి సిటీ ఎమ్మెల్యే భరత్‌రెడ్డి రాజకీయ చక్రం తిప్పారు. కేఎంఎఫ్ మాజీ అధ్యక్షుడు బీమ్లానాయక్‌ను తప్పించం వెనుక నాగేంద్ర కీలక పాత్ర పోషించినట్లు రాజకీయవర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. మొత్తం మీద కేఎంఎఫ్ అధ్యక్షుడి ఎంపిక, ఎన్నికల్లో పంతం నెగ్గించుకున్నామని కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెగా మిల్క్ డెయిరీని ప్రారంభించాలని వినతి

మెగా మిల్క్ డైరీని బళ్లారిలో త్వరలో ప్రారంభించాలని నూతన అధ్యక్షుడు రాఘవేంద్ర హిట్నాళ్‌ను బళ్లారి ప్రముఖ నాయకుడు, కొత్తపల్లి తిమ్మరాజులు, నాగరాజు, గుమ్మనూరు జగన్, బడిదేపల్లి సత్యనారాయణరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, విజ్జి, అన్ననాగరాజు, ఇతర బళ్లారి ప్రముఖులు కోరారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులను వీరు ఘనంగా సన్మానించారు.

నేనే అధ్యక్షుడిని.. దమ్ముంటే రండి..!

● బళ్లారిలోనే మెగా డెయిరీ ఏర్పాటు చేస్తాం

● పార్టీ పెద్దల ఆశీస్సులతో వచ్చా.. ఎవరికీ భయపడను: హిట్నాళ్

దమ్ముంటే గతంలో ఉన్న కేఎంఎఫ్ అధ్యక్షులు ముందుకు రండి..నేను అధ్యక్షుడిగా వచ్చాను అంటూ నూతన అధ్యక్షుడు, కొప్పళ్ ఎమ్మెల్యే రాఘవేంద్ర యత్నాళ్ సవాల్ విసిరారు. అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం సిద్దరామయ్య దీవెనలు, డికే శివకుమార్ అండ, మంత్రి జమీర్ అమ్మద్, మాజీ మంత్రి నాగేంద్ర తదితర నేతల అండ తనకే ఉందన్నారు. కేఎంఎఫ్ ను అభివృద్ధి వైపు తీసుకుపోతానని, బళ్లారి లోనే మెగా డెయిరీ ఏర్పాటు చేస్తామన్నారు. కేఎంఎఫ్‌లో అన్ని సమస్యలు పరిష్కరిస్తానన్నారు. పార్టీలో భేదాభిప్రాయాలు ఉన్నాయా అని విలేకరులు ప్రశ్నించగా అలాంటిదేమీ లేదన్నారు. బీమానాయక్ మంచి స్నేహితులు కదా ఎందుకు విభేదించారు అని ప్రశ్నించగా, అందుకు ఆయన రాజకీయంలో ఎక్కడ మిత్రుడు అంటూ దాటేశాడు.

పౌరకార్మికులకు రక్షణ పరికరాలు తప్పనిసరి

● రాష్ట్ర సఫాయి కర్మచారి కమిషన్ కార్యదర్శి చంద్రకళ



మాట్లాడుతున్న సఫాయికర్మచారి కమిషన్ కార్యదర్శి చంద్రకళ

బళ్లారి సిటీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి మున్సిపల్ కార్పోరేషన్లు, మున్సిపాలిటీలు, పట్టణపంచాయతీ, గ్రామపంచాయతీల్లో పనిచేసే పారిశుద్య కార్మికులు, పౌరకార్మికులు తప్పనిసరిగా రక్షణ పరికరాలను ధరించాలని కర్ణాటక రాష్ట్ర సఫాయి కర్మచారి కమిషన్ కార్యదర్శి చంద్రకళ అన్నారు. శుక్రవారం నగరంలోని మున్సిపల్ కార్పోరేషన్ ఆడిటోరియంలో పారిశుద్య కార్మికులు, పౌరకార్మికులు, మాన్యువల్ స్కావెంజర్లు , నగర మున్సిపల్ కార్పోరేషన్‌లో పనిచేస్తున్న వారి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యక్ష సంభాషణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు వారు శుభ్రం చేసే ప్రదేశాల్లో పదునైన వస్తువులు, విషపూరిత వస్తువులపై అప్రమత్తంగా ఉండాల న్నారు. ఆరోగ్యం, భద్రత దృష్ట్యా రక్షణ పరికరాలు తప్పనిసరిగా ధరించాలన్నారు. ప్రభుత్వ సౌకర్యాలు సకాలంలో చేరుతున్నాయో లేదా అని పర్యవేక్షించడం రాష్ట్ర సఫాయి కర్మచారీ కమిషన్ ప్రధాన లక్ష్యం అన్నారు. నరగ కార్పోరేషన్ మున్సిపల్ కార్మికుల నాయకురాలు రత్నమ్మ మాట్లాడుతూ కార్పోరేషన్ పరిధిలోని మున్సిపల్ కార్మికుల పిల్లలకు ఉన్నత విద్య కోసం రుణాలు అందించాలని, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేయాలన్నారు. నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంపై చర్యలు తీసుకోవాలని అన్నారు. మరో పౌర కార్యకర్త కళావతి మాట్లాడుతూ కార్పోరేషన్ అన్ని భద్రతా పరికరాలను ఎప్పటికప్పుడు పంపిణీ చేస్తోందన్నారు. అయితే జీతాల చెల్లింపులో జాప్యం జరుగుతోందన్నారు. నగర కార్పోరేషన్ పరిధిలో మున్సిపల్ కార్మికులకు అన్ని రకాల సౌకర్యాలు లేవని మున్సిపల్ కార్మికుల కార్యదర్శి దృష్టికి తీసుకురాగా మున్సిపల్ కమిషన్ స్పందించి ఎమ్మెల్యే గ్రాంట్‌తో వచ్చే ఏడాది నగరంలోని మూడు ప్రాంతాల్లో అన్ని రకాల సౌకర్యాలతో కూడిన విశ్రాంతి గదులు నిర్మిస్తామన్నారు. పౌరకార్మికులు గృహవసతి కల్పించాలని కోరగా ముండరగి ఆశ్రయ గృహనిర్మాణ పథకం కింద 5000 ఇళ్ల నిర్మిస్తున్నారన్నారు. వీటిలో 200 ఇళ్ళు కార్మికులకు రిజర్వ్ చేశామన్నారు.

కమిషన్ పరిశోధన అధికారి మహదేవస్వామి మాట్లాడుతూ కార్మికులకు నల్లటి యూనిఫామ్‌లు ఇచ్చామని ఉదయం, సాయంత్రం వేళల్లో వారు పనిచేస్తున్నట్లు చూడలేదన్నారు. దీనిని వెంటనే మార్చాలని పాలికె కమిషనర్‌ను ఆదేశించారు. ఈసందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చిదానంద,జిల్లాసఫాయి కర్మచారి విభాగం జిల్లా అవగాహన కమిటీ సభ్యుడు కందకూరు రాముడు, కర్ణాటక రాష్ట్ర సఫాయి కర్మచారి కమిషన్ కార్యదర్శి వ్యక్తగత కార్యదర్శి రఘు, జిల్లా సఫాయి కర్మచారి అభివృద్ధి సంస్థ తాలూకా అభివృద్ధి అధికారి లక్ష్మణ్, కార్పోరేషన్ పర్యావరణ ఇంజనీర్లు, జిల్లాస్థాయి అధికారులు, పౌర కార్మికులు పాల్గొన్నారు.


ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి: వైద్యాధికారి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి బాలాజీ

సిరుగుప్ప, జూలై 25(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ నెలనెలా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదని కరూరు ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి బాలాజీ సూచించారు. శుక్రవారం తాలుకాలోని కరూరు గ్రామంలో ప్రభుత్వాస్పత్రి, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్ష శిబిర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి నెలా బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. పంచాయతీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, పదాధికారులు, సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

తాయమ్మదేవికి ప్రత్యేక పూజలు



సిరుగుప్ప, జూలై25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వెలసిన తాయమ్మదేవికి తొలి శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. సిరుగుప్ప పట్టణం ఆదోని రోడ్డు మార్గంలో వెలసిన తాయమ్మదేవికి శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని భక్తులు బారులు తీరారు. అర్చకులు శ్రీనివాస, ప్రవీణ్ దేవికి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఆకు పూజ, మహామంగళహారతి చేశారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

కంప్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): శిరిగేరి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉత్తనూరు గ్రామం సమీపంలోని ఒక డంప్‌లో నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుకను పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. శిరిగేరి క్రాస్ సిద్దాపురం మధ్యలో ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోగా ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యారు. ట్రాక్టర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న లోకాయుక్త అధికారులు

ఫిర్యాదులపై తక్షణమే స్పందించండి

● అధికారులకు లోకాయుక్త సూచన

కంప్లి, జూలై25(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలని లోకాయుక్త అధికారి నాగిరెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం కంప్లి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేసిన సమావేశంలో లోకాయుక్త అధికారులు పాల్గొని తెలిపారు. ప్రజలకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని, సమస్యలపై వచ్చే వారిపట్ల నిర్లక్ష్యం తగదన్నారు. ఎంతోమంది అధికారులు రిటైర్మెంట్ అయినా ఇప్పటికే ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. అలాంటి అధికారులను నిదర్శనంగా తీసుకోవాలన్నారు. మున్సిపాల్టీ తాలుకా పంచాయతీ ఎక్సైచేంజ్ ఉద్యానవన శాఖ శిక్షణ అగ్నిమాపక దళం శాఖ విద్యా వసతి శాఖ శిశు మహిళా శాఖ ఆరోగ్య శాఖ తదితర శాఖలు అధికారులు పాల్గొన్నారు. ఏ కార్యాలయంలోనైనా సరే అవినీతికి పాల్పడితే వారిపైన ఎటు తప్పదని ఘాటుగా సూచించారు. సమస్యలపై వచ్చిన ప్రజలకు తమ సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సూచించారు. తాలుకా పంచాయతీ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లన్న గౌడ, రాజ్ కుమార్ వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే



విద్యార్థికి ల్యాప్ టాప్ అందిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బళ్లారి సిటీ,జూలై 25(ఆంధ్రజ్యోతి): ఇది డిజిటల్ యుగం పుస్తకాలపై మాత్రమే ఆధారపడటం సరిపోదు, సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన 23వ వార్డుకు చెందిన మల్లయ్య కుమార్తె, ఉత్తమ మార్కులు సాధించిన బి.అక్షతకు ల్యాప్‌టాప్ అందజేశారు. అక్షత బీ.ఈ చదువుతోంది ఆమె చదువును సులభతరం చేయడానికి ల్యాప్‌టాప్ ఇస్తున్నామన్నారు. కాంగ్రెస్ నాయకుడు హొన్నప్ప, గాదెప్ప, గోవింద, పి.కౌశిక్ యాదవ్, వంశీ తదితరులున్నారు.

బీఎన్‌హెచ్‌ఎస్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



సంతకం చేస్తున్న న్యాయవాది

బళ్లారి సిటీ,జూలై 25(ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం బళ్లారి నాగరీకుల పోరాట సమితి(బీఎన్‌హెచ్‌ఎస్) పౌర సౌకర్యాలను డిమాండ్ చేస్తూ ఈనెల 27న ఆదివారం గాంధీ భవన్లట బహిరంగ సభను నిర్వహిస్తోంది. ప్రజల నుంచి మద్దతు కోరుతూ శుక్రవారం లక్ష సంతకాల సేకరణ చేపట్టారు. సీనియర్ న్యాయవాది పాండు అనేక మంది న్యాయవాదులు నిరసనకు మద్దతు తెలిపారు. బళ్లారిలో రోజు రోజుకూ అనేక సమస్యలు పెరుగుతున్నాయని, ఇలాంటి కార్యక్రమానికి అందరూ మద్దతివ్వాలని న్యాయవాదులు పిలుపునిచ్చారు. సమితి సమన్వయకర్తలు సోమశేఖర్‌గౌడ, డాక్టర్ ప్రమోద్, రోహన్, బాలయోగి, శర్మస్ నాగరత్న, శాంత పాల్గొన్నారు.

అవార్డుల ఎంపికపై కళాకారుల అసంతృప్తి



మాట్లాడుతున్న కళాకారులు తిప్పేస్వామి, ఎల్లనగౌడ శంకరబండె

బళ్లారి సిటీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నాటక అకాడమీ ఇచ్చే వార్షిక జీవిత సాఫల్య పురస్కారాలు సహా ఇతర అవార్డుల ఎంపికలో బళ్లారి జిల్లాకు చెందిన కళాకారులను విస్మరించారని , అవార్డు ఎంపిక కమిటీపై బళ్లారి జిల్లా కళాకారుల సంఘం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది బళ్లారి జిల్లా పట్ల నాటక అకాడమీ నిర్లక్ష్య వైఖరి అని కళాకారుల సంఘం కార్యదర్శి తిప్పేస్వామి, సంఘం అధ్యక్షుడు ఎల్లనగౌడ శంకర బండె అన్నారు. శుక్రవారం కన్నడ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కళాకారుల జిల్లాగా పేరొందిన బళ్లారికే ఇలా జరగడం దారుణమన్నారు. దీనిపై జిల్లా నాయకులు స్పందించాలన్నారు. ఈసందర్భంగా కళాకారులు సుబ్బన్న, జయశ్రీ పాటిల్, రమణప్ప, హులుగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు 'మనోపరివర్తన'



వేదిక సభ్యులకు స్వాగతం పలుకుతున్న జైలు అధికారులు

బళ్లారి గాంధీనగర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): భారత దేశాన్ని ఆరోగ్యకర సమాజ స్థాపనకోసం కృషి చేయాలని అఖిల కర్నాటక జనజాగృతివేదిక ట్రస్ట్ రాష్ట్ర కార్యదర్శి, రీజనల్ డైరెక్టర్ వివేక్ విన్సంట్ పాయస్ పేర్కొన్నారు. శ్రీ క్షేత్ర ధర్మస్థళ గ్రామాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా బీసీ ట్రస్ట్, జిల్లా చట్టసేవ ప్రాధికార ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర కారాగృహం, బళ్లారి అఖిల కర్ణాటక జిల్లా జనజాగృతి వేదిక సంయుక్త ఆధ్వర్యంలో సెంట్రల్ జైల్‌లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు మనో పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టుకతోనే ఎవరూ నేరస్తులు కారని, క్షణికావేశంలో చేసిన తప్పుకు శిక్ష అనుభవిస్తున్నారని, అయినంత మాత్రాన కుంగిపోరాదని, శిక్ష ముగిసి బయటకు వెళ్ళిన తరువాత ఉత్తమమార్గం ఎన్నుకుని జీవనం సాగించాలని కోరారు. ప్రస్తుతం సమాజం కలుషితమైందని, మనుషులు ఆరోగ్యవంతులుగా జీవించడం కష్టతరమైందన్నారు. దుర్వసనాలకు బానిసై ఎంతో తమ కుటుంబాలను నాశనం చేసుకుంటున్న ఘటనలు నిత్యం వెలుగు చూస్తున్నాయన్నారు. ఇలాంటి పరివర్తనా కార్యక్రమాల ద్వారా దుర్వసనాలకు బానిసైన వారికి జాగృతం చేయడమే తమ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో భాగంగా మునుముందు పాఠశాల, కళాశాల విద్యార్థులు ఉత్తమ భవిష్యత్ కోసం పూజ్యుల ఆశీర్వాదంతో రాష్ట్ర వ్యాప్తంగా జాగృతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి రాజేష్ హొసమని ఖైదీలను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో సెంట్రల్ జైల్ సూపరెండెంట్ ఆర్.లతాలతో అఖిల కర్ణాటక జనజాగృతి వేదిక ట్రస్ట్ రాష్ట్ర సంఘనా కార్యదర్శి నగరాజు, శ్రీ క్షేత్ర ధర్మస్థళ బీసీ ట్రస్ట్ రీజినల్ డైరెక్టర్ జె.చంద్రశేఖర్, సంస్థ డైరెక్టర్ రూహితాక్ష, అఖిల కర్ణాటక జిల్లా జనజాగృతి వేదిక ఉపాధ్యక్షుడు భాస్కర్, రూపశ్రీ, నాగేష్, క్షేత్ర కోఆర్డినేటర్ సతీష్, వ్యవసాయ క్షేత్రం పరిశీలకులు మహేష్.ఎస్, నగర గాంధీనగర్ పోలీసు విభాగం అధికారులు పాల్గొన్నారు.

హోసూరు జోన్



మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డితో కార్యకర్తలు

ఏఐఏడీఎంకేలోకి పలువురి చేరిక

హోసూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): వివిధ పార్టీలను వీడిన పలువురు ఏఐఏడీఎంకేలోకి చేరారు. మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి సమక్షంలో 50మందికిపైగా చేరారు. వారిని పార్టీ కండువాలతో ఆత్మీయంగా స్వాగతించారు. ఏఐఏడీఎంకే పశ్చిమజిల్లా హోసూరు సమీపంలోని బాగలూరు ప్రాంతం నుంచి వివిధ పార్టీలను వీడినవారు చేరారు. పార్టీ హోసూరు ఉత్తర యూనియన్ కార్యదర్శి రవికుమార్ నేతృత్వంలో యువకులు చేరారు.

శరవేగంగా ఆలయ నిర్మాణ పనులు

కంప్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): కుడితిని పట్టణంలోని 3వ వార్డు నేతాజీ కాలనీలో ఆంజనేయ స్వామి ఆలయ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వార్డు కౌన్సిలర్ దుగ్గప్ప తెలిపారు. విలేకరులతో మాట్లాడిన ఆయన శ్రావణమాసం మొదటి శుక్రవారం మంచిరోజులు పరిగణలోకి తీసుకుని ఆలయం తలుపులతో పనుల్ని ప్రారంభించామని తెలిపారు. ఆలయ నిర్మాణానికి రూ. 25 లక్షలకు పైగా ఖర్చు అవుతుందన్నారు. ఇప్పటికే తమవంతుగా ఆలయం ఏర్పాటుకు సాకారం అందించామన్నారు. ఈ పూజలో పాల్గొన్న పట్టణ పంచాయతీ స్థాయి సమితి అధ్యక్షుడు వి రాజశేఖర్ మాట్లాడుతూ ఆలయం ఏర్పాటు కోసం స్థానిక ఎమ్మెల్యే ఎంపీ కూడా సహకారాలు అందిస్తారని తెలిపారు. రూ. 5 లక్షలు మంజూరు చేస్తామని తెలిపారన్నారు. తమ వంతుగా రూ. 30 వేలు ఆలయం ఏర్పాటుకు సహకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు దగ్గప్ప, వెంకటరమణ బాబు, గంగాధర, సంపత్, శ్రీనివాసులు, నాగరాజు, రుద్రప్ప, వాసప్ప, వీరేష్, మంజు, ఉమేష్, యర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయస్వామి ఆలయ పనులను పరిశీలిస్తున్న సభ్యులు



నిరసన తెలుపుతున్న పెన్షనర్ల సంఘం సభ్యులు

పెన్షన్ సమీక్ష చట్టానికి వ్యతిరేకంగా నిరసన

హోసూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): పెన్షన్ సమీక్ష చట్టాన్ని వ్యతిరేకిస్తూ పెన్షనర్ల సంఘాల జాతీయ సమన్వయ కమిటీ పిలుపు మేరకు నగరంలో శుక్రవారం నిర్వహించారు. గాంధీ విగ్రహం నుంచి రామ్‌నగర్‌లోని అన్నా విగ్రహం దాకా మానవహారంగా నిరసన ర్యాలీ కొనసాగింది. పెన్షనర్లసంఘం జిల్లా అధ్యక్షుడు దురై మాట్లాడుతూ జాతీయ కమిటీ పిలుపుతో దేశవ్యాప్తంగా మానవహారంగా నిరసన చేపట్టామన్నారు. ఆగస్టు 24న రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించి గవర్నర్‌కు వినతిపత్రం సమర్పిస్తామని, సెప్టెంబరు 7 నుంచి 14వరకు ఎంపీలతో సమావేశం ఉంటుందన్నారు. సెప్టెంబరు 20న రాష్ట్ర రాజధానిలో మీడియా సమావేశం, అక్టోబరు 11న రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ప్రధాన న్యాయమూర్తికి వినతిపత్రం సమర్పించేందుకు ఢిల్లీలో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. నిరసనలో ప్రభుత్వ అన్నిశాఖల పెన్షనర్స్ అసోసియేషన్, తమిళనాడు ఎలక్ట్రిసిటీ బోర్డ్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, బీఎస్ఎన్ఎల్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎల్ఐసీ పెన్షనర్స్ అసోసియేషన్ ఇతర పదాధికారులు పాల్గొన్నారు.

నర్సరీల్లో మట్టి కుండీలు వాడాలని డిమాండ్

హోసూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడేందుకు ప్లాస్టిక్ కవర్లకు బదులుగా మట్టికుండీలలో మొక్కలు పెంచేలా చైతన్యం కల్పించాలని పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు. కృష్ణగిరి జిల్లాలోని హోసూరు ప్రాంతం సారవంతమైన నేల, చల్లటి వాతావరణం ఉండడంతో బయలు ప్రదేశాలతోపాటు గ్రీన్‌హౌస్‌లలో భారీ సంఖ్యలో పూలు పండిస్తున్నారు. పూలు మాత్రమే కాకుండా టమోటా, క్యారెట్, బీన్స్, క్యాబేజీ తదితర అన్ని రకాల కూరగాయలు సాగు చేస్తున్నారు. ప్రధానంగా మొక్కలను ప్లాస్టిక్ కవర్లలో ఉంచడంపై పర్యావరణ ప్రేమికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వేలాది మొక్కలకు వినియోగించే కవర్లు వాటిని కొనుగోలు చేశాక పొలాల్లో పడేస్తుండడంతో పర్యావరణానికి నష్టం కలుగుతోందని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైన నర్సీలలో మొక్కలు పెంచేవారు ప్లాస్టిక్ తగ్గించాలని కోరుతున్నారు.



ప్లాస్టిక్ కవర్లలో మొక్కలు